ప్రజాశక్తి

సోమవారం ఏప్రిల్ 22 2024 8 పేజీలు

శ్రీకాకుళం

డ్వాక్రా ఓటర్ల పైనే నేతల చూపు

(4, 5లో)

- ప్రతి ఎన్నికల్లో ఆ హామీతోనే అభ్యర్థి గెలుపు
- ఈసారి ఆ అంశమే అజెండాలో లేని వైనం
- వైసిపి, టిడిపి కలిసి ఒకే రాగం
- ఫ్యాక్టరీ స్థలంలో పరిశ్రమల ఏర్పాటుకే మొగ్గు

అటకెక్కిన 'సుగర్స్'

ఆమదాలవలస నియోజకవర్గానికి ఒక ప్రత్యేకత ఉంది. సుగర్స్‌ను తెరిపిస్తామని హామీ ఇచ్చిన పార్టీని గానీ అభ్యర్థిని గానీ గెలిపిస్తూ వస్తున్నారు. హామీని విస్మరించిన వారిని ఆ తర్వాత ఎన్నికల్లో ఓడిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ తరుపున బొడ్డేపల్లి సత్యవతి, టిడిపి తరుపున కూన రవికుమార్, ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే తమ్మినేని సీతారాం చక్కెర పరిశ్రమను తెరిపిస్తామని ఇచ్చిన హామీతోనే ఆమదాలవలసలో నెగ్గుకొచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పిల్లిమొగ్గలు వేయడం, హామీని అటకెక్కించడంతో ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఓటమి కూడా చవిచూశారు. ప్రస్తుత ఎన్నికల్లో సుగర్స్‌పై కనీస ప్రస్తావన లేకుండా పోయింది. వైసిపి, టిడిపి రెండూ కూడబలుక్కున్నట్లుగా సుగర్స్ అంశం జోలికే వెళ్లడం లేదు. పైగా సుగర్ ఫ్యాక్టరీ స్థలంలో ప్రత్యామ్నాయంగా పరిశ్రమలను ఏర్పాటు చేయాలనే విధానానికి రెండు పార్టీలూ జై కొడుతున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు, ప్రజలే సుగర్స్ అంశాన్ని ఒక అజెండాగా పార్టీల ముందు ఉంచాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.

(...2లో)

తీరానికి కొట్టుకొచ్చిన ఆలివ్‌రిడ్లే తాబేళ్ల కళేబరం

తీరంలో తాబేళ్ల మృత్యు ఘోష

- ఒడ్డుకు కొట్టుకొస్తున్న అరుదైన ఆలివ్‌రిడ్లే కళేబరాలు
- కానరాని సంరక్షణ చర్యలు
- నిషేధిత వలలు, బోట్లు తగిలి మృత్యువాత
- పర్యావరణ సమతుల్యతపై ప్రభావం

ప్రజాశక్తి - నౌపడ

అరుదైన ఆలివ్‌రిడ్లే తాబేళ్లు అధిక సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయి. సంతబొమ్మాళి మండలంలోని భావనపాడు, సున్నాపల్లి, మేఘవరం తీరాలకు ఈ తాబేళ్ల కళేబరాలు కొట్టుకొస్తున్నాయి. ఆలివ్‌రిడ్లే తాబేళ్లు గుడ్లు పెట్టేందుకు ఒడ్డుకు వస్తున్న సమయంలో చేపల వేట బోట్లకు తగిలి మృత్యువాత పడుతున్నాయి. ప్రధానంగా విశాఖపట్నం, పారాదీప్ ప్రాంతాల నుంచి వచ్చిన బోటుల్లో రింగు వలలు, డిస్కో వలలు, మెకనైజ్డు బోట్ల ఫ్యాన్లకు తగిలి మృతి చెందుతున్నాయని (మిగతా...2లో)

24న జగన్ పర్యటన

- శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలిలో బస్సు యాత్ర
- టెక్కలిలో 'మేమంతా సిద్ధం' ముగింపు సభ
- వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్
- విజయవంతం చేయాలని పిలుపు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్, టెక్కలి రూరల్

ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఈనెల 24వ తేదీన జిల్లాలో పర్యటించనున్నారని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జగన్ చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా 23న రాత్రి ఎచ్చెర్ల నియోజకవర్గానికి చేరుకుంటారని పేర్కొన్నారు. అక్కడే రాత్రి బస చేసి, 24న శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి నియోజకవర్గాల్లో బస్సు యాత్రను చేపడతారని తెలిపారు. టెక్కలిలో బస్సు యాత్ర ముగుస్తుందని, ఈ (మిగతా...2లో)

చట్టాలు... శిక్షలు

(4, 5లో)

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దు

- స్వేచ్ఛగా ఎన్నికల నిర్వహణే లక్ష్యం
- జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

అధికారులకు సూచనలు చేస్తున్న మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. హింసకు తావు లేకుండా, ఎన్నికలు తిరిగి నిర్వహించే అవసరం రాకుండా స్వేచ్ఛగా, సజావుగా సార్వత్రిక ఎన్నికలను నిర్వహించడమే లక్ష్యంగా ఎన్నికల సంఘం పనిచేస్తోందని చెప్పారు. ఇదే లక్ష్యంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. మండలంలో ఆదివారం పర్యటించిన ఆయన, ఎన్నికల (మిగతా...2లో)

బిఫామ్‌లను అందుకుంటున్న టిడిపి అభ్యర్థులు

టిడిపి అభ్యర్థులకు బిఫామ్‌లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికల్లో శ్రీకాకుళం పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు పోటీ చేస్తున్న తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు బిఫామ్‌లు అందజేశారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఆదివారం శ్రీకాకుళం పార్లమెంట్ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో పాటు ఏడు శాసనసభ నియోజకవర్గాల (మిగతా...2లో)

వీడని భల్లూకాల భయం

- ఆలయంలో ఎలుగు
- అటవీశాఖ అధికారులపై స్థానికుల గరంగరం

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

భల్లూకాల భయం ఉద్దానం ప్రాంతాన్ని వీడడం లేదు. తాజాగా గరుడభద్ర పంచాయతీ పరిధిలోని తర్లాగడూరు సమీపంలోని తోటల్లో ఉన్న మంకినమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఎలుగుబంటి హల్‌చల్ చేసింది. జీడితోటల్లో పిక్కలు ఏరుకోవడానికి వెళ్తున్న రైతులు ఆలయ ప్రాంగణంలో ఎలుగుబంటి సంచరించడాన్ని గుర్తించారు. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో, వారు ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయానికి తలుపులు లేకపోవడం, జీడితోటలు గుబురుగా ఉండడంతో ఎలుగుబంటిని బంధించడానికి వీలు కాలేదని అటవీశాఖ అధికారులు చెప్పారు. అమ్మవారి ఆలయంలోనే ఎలుగు తిష్ట వేయడంతో స్థానికులు ఆందోళన చెందారు. యువకులు, గ్రామస్తులు ఎలుగుబంటికి ఇబ్బంది కలిగించకుండా ఆలయం నుంచి బయటకు వచ్చే వరకు వేచిచూశారు. మధ్యాహ్నం మూడు గంటల

ఆలయంలో ఉన్న ఎలుగుబంటి

తర్వాత ఆలయం నుంచి బయటకు వచ్చిన ఎలుగుబంటి సమీప తోటల నుంచి పరుగు తీయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం గండం తప్పినా, జీడిపిక్కలు ఏరడానికి రైతులు నిత్యం (మిగతా...2లో)

వాహనాల తనిఖీలను పరిశీలిస్తున్న రాఘవేంద్ర మీనా

ప్రతి వాహనం విధిగా తనిఖీ

ప్రజాశక్తి - పొందూరు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం, నగదు అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా అధికారులను ఆదేశించారు. మండలంలోని రాపాక కూడలి వద్ద చెక్‌పోస్టును ఆదివారం పరిశీలించి, స్వయంగా తనిఖీలు చేపట్టారు. అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ తనిఖీలు చేయాలన్నారు. రాత్రి వేళల్లో గస్తీ పెంచాలని సూచించారు.

నేడు 'పది' ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించిన పదో తరగతి పరీక్షల ఫలితాలు సోమవారం విడుదల కానున్నాయి. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు 28,982 మంది రెగ్యులర్ విద్యార్థులు, 1592 మంది ప్రైవేటు విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. రెగ్యులర్ విద్యార్థుల్లో బాలురు 14,843 మంది, బాలికలు 14,139 మంది ఉన్నారు. జిల్లాలో 145 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షల్లో 12 మంది విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడి డిబార్ అయ్యారు. 960 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మిగిలిన వారంతా పరీక్షలు రాశారు.

అటకెక్కిన 'సుగర్స్'

- ప్రతి ఎన్నికల్లో ఆ హామీతోనే అభ్యర్థి గెలుపు
- ఈసారి ఆ అంశమే అజెండాలో లేని వైనం
- వైసిపి, టిడిపి కలిసి ఒకే రాగం
- ఫ్యాక్టరీ స్థలంలో పరిశ్రమల ఏర్పాటుకే మొగ్గు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఆమదాలవలస నియోజకవర్గానికి ఒక ప్రత్యేకత ఉంది. సుగర్స్‌ను తెరిపిస్తామని హామీ ఇచ్చిన పార్టీని గానీ అభ్యర్థిని గానీ గెలిపిస్తూ వస్తున్నారు. హామీని విస్మరించిన వారిని ఆ తర్వాత ఎన్నికల్లో ఓడిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ తరుపున బొడ్డేపల్లి సత్యవతి, టిడిపి తరుపున కూన రవికుమార్, ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే తమ్మినేని సీతారాం చక్కెర పరిశ్రమను తెరిపిస్తామని ఇచ్చిన హామీతోనే ఆమదాలవలసలో నెగ్గుకొచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పిల్లిమొగ్గలు వేయడం, హామీని అటకెక్కించడంతో ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఓటమి కూడా చవిచూశారు. ప్రస్తుత ఎన్నికల్లో సుగర్స్‌పై కనీస ప్రస్తావన లేకుండా పోయింది. వైసిపి, టిడిపి రెండూ కూడబలుక్కున్నట్లుగా సుగర్స్ అంశం జోలికే వెళ్లడం లేదు. పైగా సుగర్ ఫ్యాక్టరీ స్థలంలో ప్రత్యామ్నాయంగా పరిశ్రమలను ఏర్పాటు చేయాలనే విధానానికి రెండు పార్టీలూ జై కొడుతున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు, ప్రజలే సుగర్స్ అంశాన్ని ఒక అజెండాగా పార్టీల ముందు ఉంచాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.

ఆమదాలవలస సుగర్స్ అంశంపై టిడిపి యు టర్న్ తీసుకున్నట్లు కనిపిస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో సుగర్స్‌కు ప్రత్యామ్నాయంగా ఆ స్థలంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నది కొత్త అజెండాగా ఎంచుకుంది. సుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో హామీనిచ్చి, నేటికీ తెరిపించలేదంటూ ఆమదాలవలసలో ఫిబ్రవరి 13న నిర్వహించిన శంఖారావం సభలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ ప్రస్తావించారు. శంఖారావం సభలు నిర్వహించిన ఆయా నియోజకవర్గాల్లో వైసిపి హామీ ఇచ్చి విస్మరించిన అంశాలను తాము అమలు చేస్తామని చెప్పిన లోకేష్, ఇక్కడ రేఖామాత్రంగానైనా చెప్పలేదు. ఫ్యాక్టరీ తెరవకుండా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మాట తప్పి మడమ తిప్పారంటూ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కూన రవికుమార్ విమర్శిస్తూనే, సుగర్ ఫ్యాక్టరీ స్థానంలో పరిశ్రమలను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలంటూ చెప్పుకొచ్చారు. తద్వారా సుగర్ ఫ్యాక్టరీ విషయంలో టిడిపి వైఖరేమిటో తేటతెల్లమైంది.

ప్రభుత్వ వంచన

సుగర్ ఫ్యాక్టరీ విషయంలో ప్రభుత్వం ఇప్పటివరకు అనుసరించిన వైఖరిని గమనించిన టిడిపి, తానూ అదే దారిలో వెళ్తే జనం ఎవరికో ఒకరికి ఓటేయక మానరని భావిస్తున్నట్లుగా కనిపిస్తోంది. ఆమదాలవలస నియోజకవర్గానికి ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న తమ్మినేని సీతారాం సుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని 2019 ఎన్నికల్లో హామీ ఇవ్వడంతో ఆ ప్రాంత ప్రజలు, రైతులు ఆదరించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2020, ఫిబ్రవరి రెండో తేదీన ఆ ప్రాంతాన్ని నిపుణుల కమిటీ సందర్శించి, యంత్రాల పరిశీలనతో పాటు రైతులతో కమిటీ సభ్యులు మాట్లాడారు. తామంతా చెరుకు పండించడానికి సిద్ధంగా ఉన్నట్లు వారు కమిటీ ముందు స్పష్టంగా చెప్పారు. దీంతోపాటు ఫ్యాక్టరీని తెరిపించాలంటూ లక్ష సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కమిటీ పర్యటించి నాలుగేళ్లు గడిచినా దానికి అతీగతీ లేకుండా పోయింది. 2021 నవంబరులో అప్పటి కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు రాసిన లేఖ ప్రభుత్వం అసలు ఉద్దేశాన్ని బట్టబయలు చేసింది. పరిశ్రమకు సంబంధించి ఏవైనా న్యాయపరమైన చిక్కులు ఉన్నాయా?, పరిశ్రమను తెరవాలంటూ నిరంతరం ఆ ప్రాంతంలో ఉద్యమాలు ఏమైనా జరుగుతున్నాయా? వంటి అంశాలపై తనిఖీ చేసి నివేదిక పంపాలంటూ లేఖలో పేర్కొన్నారు. భూముల విలువ, పారిశ్రామిక, వాణిజ్య, నివాసయోగ్యం కేటగిరీల్లో వేటికి అనువుగా ఉంటాయో సరైన సూచనలు చేయాలంటూ కోరారు. కోర్టు కేసుల వివరాలు, భూముల విలువ వంటి అంశాలతో పాటు ప్రస్తుతానికి ఆ ప్రాంతంలో ఎటువంటి ఆందోళనలు జరగడం లేదంటూ ఆ నెలలోనే కలెక్టర్ నివేదిక పంపారు. సుగర్ ఫ్యాక్టరీని తెరిపించే ఉద్దేశం లేకే ప్రభుత్వం ఈ వివరాలన్నీ అడిగిందంటూ అప్పట్లో రైతుల్లో కొంత చర్చ సాగింది.

రెండు దశాబ్దాలుగా మోసపోతున్న రైతులు

పాదయాత్ర సందర్భంగా 2003లో ఈ ప్రాంతానికి వచ్చిన కీ.శే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తాము అధికారంలోకి వస్తే సుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామంటూ హామీనిచ్చారు. కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసిన బొడ్డేపల్లి సత్యవతిని ప్రజలు ఆదరించారు. ఆ తర్వాత ఓ సందర్భంలో వైఎస్ ఆ అంశాన్ని ప్రస్తావిస్తూ, పెళ్లి చేసి అత్తారింటికి పంపేసిన తర్వాత ఆడపిల్లను తిరిగి తెచ్చుకోవడం సాధ్యమవుతుందా అంటూ నాడు చెప్పిన మాటలతో తొలిసారి మోసపోయిన రైతులు, ఇక అక్కడ నుంచి పాలక పార్టీల వంచనకు గురవుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో సుగర్స్‌పై మరో ఉద్యమం చేపట్టడమే రైతుల ముందు ప్రత్యామ్నాయంగా ఉంది. ఆమదాలవలస సుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణ కమిటీ ఆమదాలవలస ప్రాంతంలో 2007 నుంచి 2014 మధ్య కాలంలో పాదయాత్రలు, రిలే నిరాహార దీక్షలు వంటి రూపాల్లో నిరంతరం ఆ అంశాన్ని ప్రజల మధ్య చర్చగా ఉంచింది. ప్రధాన రాజకీయ పార్టీలు సైతం దీనిపై మాట్లాడాల్సి వచ్చింది. ఇదే అంశం ఎన్నికల అజెండాగా మారింది. 2014, 2019 ఎన్నికల్లో టిడిపి, వైసిపిలు ఇదే హామీతో నెగ్గాయి. రైతులు నాటి ఉద్యమ స్ఫూర్తితో ఈ ఎన్నికల్లో సుగర్స్ అంశాన్ని ప్రధాన అజెండాగా మార్చాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

మొదటి పేజీ తరువాయి

తీరంలో తాబేళ్ల మృత్యు ఘోష

మత్స్యకారులు చెప్తున్నారు. తీరం నుంచి కొంతదూరం వరకు నిషేధిత వలలు వాడకూడదని నిబంధనలు ఉన్నా, పర్యవేక్షణ లేకపోవడంతో యథేచ్ఛగా వాటితోనే వేట సాగిస్తున్నారు. ఆలివ్‌రిడ్లే తాబేళ్ల మృతి ప్రభావం పర్యావరణ సమతుల్యతపై పడుతోంది.

కానరాని రక్షణ ఏర్పాట్లు

అరుదైన ఈ తాబేళ్ల సంరక్షణ కోసం అటవీశాఖ అధికారులు ప్రత్యేక రక్షణ ఏర్పాట్లు చేస్తారు. ఇవి సముద్రం నుంచి తీరానికి వచ్చి గుడ్లు పెడతాయి. ఆ సమయంలో అటవీశాఖ సిబ్బంది వీటి గుడ్లను వేలాది సంఖ్యలో సేకరించి ప్రత్యేకమైన గూళ్లు కట్టి రక్షణ వలయాలు ఏర్పాటు చేస్తారు. వీటి గుడ్లు నక్కలు, కుక్కలు ఇతర జంతువులు తినకుండా కాపాడుతారు. మళ్లీ ఇవి పొదిగి పిల్లలైన తర్వాత తిరిగి సముద్రంలోకి విడిచిపెడతారు. అయితే ప్రస్తుతం గుడ్లు పెట్టే సీజన్ వచ్చినా తీర ప్రాంతంలో ఎక్కడా రక్షణ వలయాల జాడ కనిపించడం లేదని తీర ప్రాంత గ్రామస్తులు తెలిపారు.

తాబేళ్ల సంరక్షణతో పర్యావరణ సమతుల్యత

సముద్రంలో కలిసిన పలు వ్యర్థ పదార్థాలు, ప్లాస్టిక్, కార్బన్ వంటి కలుషితమైన పదార్థాలు ఈ తాబేళ్లు ఆహారంగా తిని పర్యావరణ సమతుల్యతను కాపాడుతుంటాయి. మత్స్య సంపదకు ప్లాస్టిక్ పదార్థాల వల్ల కలిగే హానిని కొంతవరకు ఇవి అరికడతాయి. వీటిని కాపాడుకుంటే పర్యావరణంతో పాటు మత్స్య సంపద కూడా సమృద్ధిగా లభిస్తుందని, మత్స్యకారులు వీటిని జాగ్రత్తగా కాపాడుకుంటారు. గాయాలపాలై తీరానికి వస్తే సపర్యలు చేసి సముద్రంలోకి విడిచి పెడుతుంటారు. అప్పటికీ చాలావరకు విగతజీవులుగా మారిపోతుంటాయి. అటవీశాఖ, మత్స్యశాఖ అధికారులు వీటిపై దృష్టిసారిస్తే కొంతవరకైనా వీటిని సంరక్షించుకోవచ్చునని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అధికారులు దృష్టిసారించాలి

ఏటా మా తీర ప్రాంతానికి పదుల సంఖ్యలో తాబేళ్ల కళేబరాలు కొట్టుకొస్తుంటాయి. ఎక్కువగా సముద్రంలో బోట్లు తగిలి గాయపడి మృత్యువాత పడుతున్నాయి. గాయాలపాలై తీరానికి వస్తున్న వాటిని కుక్కలు, నక్కలు, పక్షులు చంపేస్తున్నాయి. వీటి గుడ్లకు రక్షణ ఏర్పాటు చేసే కేంద్రాలు కూడా ప్రస్తుతం లేవు. అధికారులు దృష్టిసారించి తాబేళ్ల రక్షణకు చర్యలు చేపట్టాలి.

- వంక గురుమూర్తి, భావనపాడు

సభా స్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీలు రఘురాం, దువ్వాడ

24న జగన్ పర్యటన

సందర్భంగా తిర్లంగి పంచాయతీ పరిధి అక్కువరం సమీపంలో నిర్వహించే మేమంతా సిద్ధం సభలో జగన్ ప్రసంగిస్తారని పేర్కొన్నారు. బస్సు యాత్ర, సభ విజయవంతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సిద్ధం సభాస్థలి పరిశీలన

సిద్ధం ముగింపు సభ నిర్వహించనున్న అక్కువరం సమీపంలోని సభా స్థలాన్ని సిఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ ఆదివారం పరిశీలించారు. ఈ సభకు లక్ష మందికి తక్కువ కాకుండా జన సమీకరణ చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 20 జిల్లాల్లో సిద్ధం సభలు నిర్వహించగా, అన్నిచోట్లా ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు కిల్లి అజయ్‌కుమార్, సర్పంచ్ గొండెలి సుజాత, ఎంపిటిసి పీత హేమలత, బమ్మిడి తులసీరావు, సర్లాన సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పి పరిశీలన

ముఖ్యమంత్రి సిద్ధం సభ నిర్వహించే సభా స్థలాన్ని ఎస్‌పి జి.ఆర్ రాధిక పరిశీలించారు. హెలీప్యాడ్‌కు అనువుగా ఉంటుందా? లేదా? అడిగి తెలుసుకున్నారు. పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. సభకు భారీ సంఖ్యలో జనాలు తరలివస్తే ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఆమె వెంట ఎఎస్‌పి జి.ప్రేమ్‌కాజల్, డిఎస్‌పి బాలచంద్రారెడ్డి, సిఐ పి.పైడయ్య ఉన్నారు.

సభా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి రాధిక

వీడని భల్లూకాల భయం

తోటలకు వెళ్తుండడంతో, ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయాందోళనలు చెందుతున్నారు. అటవీ అధికారులపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలుగుబంటి సంచారంపై సమాచారం ఇస్తే, సంఘటనా స్థలానికి ఎలుగుబంటిని బంధించడానికి అవసరమైన ఉపకరణాలు తీసుకొని రాకుండా చుట్టపు చూపుగా వచ్చారని మండిపడుతున్నారు.

మరోవైపు మెట్టూరు ఉన్నత పాఠశాల సమీపంలోనూ రెండు ఎలుగుబంట్లు తారసపడినట్లు ఆ గ్రామస్తులు తెలిపారు. ఎలుగుబంట్లకు హాని తలపెట్టకపోతే అవేమీ చేయవని అటవీశాఖ అధికారులు రెడ్డి, రాజు, పోలయ్య తెలిపారు. ఒంటరిగా కాకుండా ఇద్దరు అంతకంటే ఎక్కువ మంది వెళ్లాలని, కర్రలు పట్టుకోవాలని సూచించారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దు

ఏర్పాట్లకు సంబంధించి అధికారులకు కీలక సూచనలు చేశారు. ఇప్పటికే చేసిన ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం దిశానిర్దేశాల్లో ఎటువంటి తేడా వచ్చినా, అందుకు సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు పటిష్టంగా పనిచేసే విధంగా ముందుగానే తగు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఉండాలని సూచించారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు, ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎన్నికల కమిషన్ సూచనల ప్రకారం ఏర్పాట్ల విషయమై పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. భద్రతాపరంగా ఎలాంటి ఇబ్బంది లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ సిబ్బందికి సామగ్రిని అందించడంలో ఎలాంటి లోటుపాట్లు ఎదురుకాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం నగరంపల్లి కూడలి వద్ద ఎఫ్‌ఎస్‌టి బృందం చేపడుతున్న పనులపై ఆరా తీశారు. కార్యక్రమంలో పలాస నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి భరత్ నాయక్, తహశీల్దార్, సిబ్బంది, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

టిడిపి అభ్యర్థులకు బిఫామ్‌లు

అభ్యర్థులకు అందజేశారు. బెందాళం అశోక్ (ఇచ్ఛాపురం), గౌతు శిరీష (పలాస), కింజరాపు అచ్చెన్నాయుడు (టెక్కలి), బగ్గు రమణమూర్తి (రమణమూర్తి), గొండు శంకర్ (శ్రీకాకుళం), కూన రవికుమార్ (ఆమదాలవలస), మామిడి గోవిందరావు (పాతపట్నం) చంద్రబాబు చేతుల మీదుగా బిఫామ్‌లను అందుకున్నారు. వైసిపి ప్రజా వ్యతిరేక విధానాలు, టిడిపి హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను ప్రతి ఇంటికీ విస్తృత ప్రచారం చేయాలని చంద్రబాబు సూచించారు.

డిగ్రీ కళాశాల.. దశాబ్దాలుగా నెరవేరని కల

రణస్థలం: మండల కేంద్రలో డిగ్రీ కళాశాల ఏర్పాటు ప్రశ్నార్థకంగా మారింది. మూడు దశాబ్దాలుగా కళాశాల ఏర్పాటు కోసం ఎదురు చూపులే మిగులుతున్నాయి. రణస్థలంలో ఏటా సుమారు రెండు వేలకు పైగా విద్యార్థులు ఇంటర్ చదువుతున్నారు. ఇక్కడ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదర్శ పాఠశాల, కెజిబివితో పాటు, నాలుగు ప్రైవేటు జూనియర్ కళాశాలలు ఉన్నాయి. లావేరు మండలంలో మూడు జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీరంతా డిగ్రీ చదివేందుకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానికంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు దశాబ్దాలుగా కోరుతున్నారు. విద్యార్థినులు డిగ్రీ చదివేందుకు దూర ప్రాంతాలకు వెళ్లలేక ఇంటర్మీడియట్‌తోనే స్వస్తి పలుకుతున్నారు. రణస్థలంలో రెండు ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఉన్నప్పటికీ అరకొర వసతులు కావడంతో అక్కడ కొంత మంది మాత్రమే చేరుతున్నారు. పూర్తిస్థాయిలో చేరేందుకు ఇష్టపడడం లేదు. ప్రతి ఏడాది రణస్థలం, లావేరు మండలాల నుంచి సుమారు 2 వేల మంది విద్యార్థులకుపైగా ఇంటర్మీడియట్ పూర్తి చేస్తున్నారు. ఈ రెండు మండలాలకు అనువుగా ఉన్న రణస్థలంలో డిగ్రీ కళాశాల లేకపోవడంతో చాలా మంది విద్యార్థులు ఇంటర్మీడియట్‌తో చదువుకి స్వస్తి చెబుతున్నారు. డిగ్రీ కళాశాల విషయంలో పాలకులు హామీలు ఇవ్వడమే తప్ప ఆచరణలో పెట్టడంలేదని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

పలుదఫాలు పరిశీలన

డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పలు దఫాలు ఆర్‌జెడితో కూడిన బృందం పరిశీలించింది. కళాశాల తరగతుల నిర్వహణకు వసతి వెసులుబాటు, భవనాల నిర్మాణానికి స్థల ఎంపిక అన్నీ పూర్తయ్యాయి. ఈ విద్యాసంవత్సరం నుంచే తరగతులు ప్రారంభిస్తారని అందరూ భావించారు. అయితే కళాశాల మంజూరు కాకపోవడంతో నిరుత్సాహ పడ్డారు. వచ్చే విద్యా సంవత్సరానికైనా కళాశాల మంజూరు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

నాటుసారాను స్వాధీనం చేసుకున్న పోలీసులు

నాటుసారా స్వాధీనం

మెళియాపుట్టి : మండలంలో కొత్తూరులో పోలీసులు ఆదివారం కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా 20 లీటర్ల నాటుసారాను, 600 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. కార్యక్రమంలో పాతపట్నం సిఐ ఎన్.సాయి, మెళియాపుట్టి ఎస్ఐ టి.రాజేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం ఊటలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని హర్షబాడ పంచాయతీ వెంకటాపురం గ్రామ సమీపంలోని కొండపై నాటు సారాకు ఉపయోగించే పదకొండు వందల లీటర్ల బెల్లం ఊటను టెక్కలి, పలాస ఎక్సైజ్‌స్టేషన్లకు చెందిన సిబ్బంది ఆదివారం మధ్యాహ్నం ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో టెక్కలి, పలాస సిఐలు రాజశేఖర్ నాయుడు, రామచంద్ర కుమార్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.

తిలక్ ఆస్తులు రూ.9.95 కోట్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వైసిపి శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ తన ఆస్తుల విలువను రూ.9.95 కోట్లుగా ఎన్నికల అఫిడవిట్‌లో పొందుపరిచారు. నందిగాం మండలం కణితూరు, నందిగాం, లట్టిగాం, కృష్ణరాయపురం, విశాఖ జిల్లా భీమిలి మండలం చిప్పాడలో కలుపుకుని 7.86 ఎకరాల ఆస్తులు కలిగి ఉన్నట్టు పేర్కొన్నారు. తన భార్య పేరుతో నందిగాం, సంతోషపురంలో 0.94 ఎకరాల విస్తీర్ణం గల భూములున్నట్టు పొందుపరిచారు. ఈ ఆస్తులన్నీ కుటుంబ వారసత్వంగా, తన వ్యక్తిగత సంపాదన ద్వారా కూడబెట్టుకున్నవని వివరించారు. తన ఆస్తుల విలువ ప్రభుత్వ మార్కెట్ ధరను అనుసరించి రూ.65,87,600 కాగా, భార్య పేరుతో ఉన్న ఆస్తి విలువ రూ.24,73,000 ఉన్నట్లు పేర్కొన్నారు. వీటితో పాటు ఇళ్ల స్థలాలు, ఇతర వ్యాపార సంబంధమైన రూ.9,30,09,600 విలువ గల ఆస్తులు తన పేరుతో ఉండగా, రూ.1,84,73,000 విలువైన ఆస్తులు తన భార్య పేరుతో ఉన్నట్లు పొందుపరిచారు. పలురూపాల్లో బ్యాంకులు, ఇతర వాణిజ్య సంస్థల నుంచి తాను రూ.34,51,771 రుణాలు తీసుకున్నట్లు తెలిపారు. తన భార్య పేరుతో రూ.73,51,027 రుణాలు పొంది ఉన్నట్లు పేర్కొన్నారు. ఇద్దరు కుమారుల పేరుతో పేరుతో ఉన్న ఆస్తుల వివరాలను అందులో పొందుపరిచారు. తనపై ఎక్కడా ఎటువంటి పోలీసు కేసులు గానీ, న్యాయ పరమైన కేసులు గానీ నమోదు కాలేదని పేర్కొన్నారు.

యాదవులకు సుస్థిర స్థానం

మాట్లాడుతున్న కామేశ్వరరావు

ప్రజాశక్తి- పలాస

టిడిపి హయాంలో యాదవులకు సుస్థిర స్థానం కల్పించి పదవులు లభిస్తున్నాయని, ఎన్‌డిఎ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష గెలుపునకు కృషి చేయాలని టిడిపి బిసిసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు అన్నారు. పలాస టిడిపి కార్యాలయంలో పలాస నియోజకవర్గం పరిధిలోని ఆదివారం యాదవులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాదవులకు బిసి డి నుంచి బిసి బికు మార్చేందుకు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో గౌతు శిరీష, ఎంపీ రామ్మోహన్ నాయుడు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. టిడిపి అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. సమావేశంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, దాసరి తాతారావు, మామిడి తాతారావు, అంబటి కృష్ణమూర్తి, డొక్కరి శంకర్, కొరికాన శంకర్, సప్ప నవీన్, వంకల కూర్మారావు, సూల చిట్టిబాబు, కొర్రాయి బాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రమాదం పొంచి ఉన్నా పట్టించుకోరా..!

మలకాంలో రహదారి మధ్యలో ప్రమాదకరంగా గొయ్యి

ప్రజాశక్తి- పొందూరు

రహదారి మధ్యలో ప్రమాదకరంగా గొయ్యి కనిపిస్తున్న ఈ దృశ్యం మండలంలోని మలకాం (జాడపేట) గ్రామం లోనిది. గ్రామంలో తాగునీటి సరఫరాకు సంబంధించిన వాల్ ఈ గోతిలో ఏర్పాటు చేసిన అధికారులు దానిపై మూత పెట్టకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ప్రధాన రహదారి కావడంతో వాహనదారులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అంతేకాకుండా చిన్నారులు, వృద్ధులు, మహిళలు నిరంతరం తిరుగుతుంటారని, రాత్రి వేళల్లో ఈ గొయ్యి కారణంగా ప్రమాదాలు సంభవిస్తున్నాయంటూ గ్రామస్తులు వాపోతున్నారు. సుమారు నాలుగేళ్లుగా ఇదే విధంగా రహదారి మధ్యలో గొయ్యి ఉన్నప్పటికీ దానిపై మూతను మాత్రం ఏర్పాటు చేయకపోవడంపై గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతి నిధులు వెంటనే స్పందించి రహదారి మధ్యలో గల ఈ గొయ్యిపై మూ తను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ

నూతన కార్యవర్గం ఏకగ్రీవం

శ్రీకాకుళం : నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవం ఎన్నుకున్నారు. స్థానిక ఎన్‌జిఒ హోంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్షులుగా సిహెచ్.ఉమాశంకర్, కార్యదర్శిగా ఎ.తారకేశ్వరరావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎం.లక్ష్మణరావును ఎన్నుకున్నారు. ఎపి ఎన్‌జిఒ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు, జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం, ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీనివాస్, నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్.చంద్రశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.శ్రీనివాసరావు, పైల శంకర్ పరిశీలకులుగా వ్యవహరించారు. ఎన్నికల అధికారులుగా ఎన్‌జిఒ సంఘ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.వేణుగోపాల్, కె.మోహనరావు వ్యవహరించారు.

దేవాదాయశాఖ ఎసి అరసవల్లి సందర్శన

శ్రీకాకుళం అర్బన్: దేవాదాయశాఖ అదనపు కమిసనర్ టి.చంద్ర కుమార్ కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో నిర్వహించిన స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివెట్టి మండపంలో వారికి స్వామివారి శేషవస్త్రాలను కప్పి చిత్రపటాన్ని అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రహ'దారుణ'ం

ఇదీ ఇండస్ట్రియల్ రోడ్డు దుస్థితి

ప్రజాశక్తి- పలాస

పలాస-పురుషోత్తపురం కూడలి నుంచి ఇండస్ట్రియల్ వరకు రోడ్డు నిర్మాణం ఏర్పాటుకు అప్పటి పాలకులు ఎంతో కృషి చేశారు. రూ.కోట్ల వ్యయంతో మెటల్, తారు రోడ్డు నిర్మించారు. ఏళ్లు గడుస్తుండడంతో తారు ఊడింది... రాళ్లు తేలిపోయాయి. దీంతో రాకపోకలకు వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కానీ, మున్సిపల్ అధికారులు తారు రోడ్డుకు మర్మతులు చేపట్టకపోవడంపై పట్టణ ప్రజలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో పట్టణ ప్రజలతో పాటు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. 15 ఏళ్ల క్రితం అప్పటి మున్సిపల్ చైర్మన్ వజ్జ బాబూరావు రూ.66 లక్షల వ్యయంతో మెటల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అనంతరం అధికారంలో ఉన్న మున్సిపల్ చైర్‌పర్సన్ కె.లక్ష్మి రూ.70 లక్షల వ్యయంతో మెటల్ రోడ్డుపై తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ రోడ్డుపై భారీ వాహనాలు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, లగేజి వాహనాలు నిత్యం రాకపోకలు చేస్తుంటాయి. రోడ్డుపై గోతులు ఏర్పడడంతో వాహనాలతో రాకపోకలు చేయలేకపోతున్నామని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడెక్కడ గోతులు, 40 ఎంఎం రాళ్లు తేలిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు నిర్మించి 15 ఏళ్లు గడుస్తున్నా మున్సిపల్ అధికారులు మర్మతులు ఎందుకు చేపట్టడం లేదో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. అటువైపుగా భారీ వాహనాలు వస్తే వాహనాలు కల్వర్టులో దిగిపోయే పరిస్థితి ఉందని, ఏమైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ పాలక వర్గం, అధికారులు చొరవ చూపి పాడైన కల్వర్టుకు మరమ్మతులు చేపట్టి పూర్తిస్థాయిలో తారు రోడ్డు నిర్మాణం చేపట్టాలని వ్యాపారులు, వాహన చోదకులు, ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా ఉన్న సూదికొండ రోడ్డు

దగ్ధమైన జీడి తోట

జీడి తోట దగ్ధం

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం హనుమంతునాయుడుపేట పంచాయతీ సీతారాంపురంలో జీడి తోట ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. ఎకరా విస్తీర్ణంలో చెట్లు కాలిపోగా, రూ.లక్ష వరకు ఆస్తినష్టం వాటిల్లిందని బాధితుడు డబ్బీరు రామారావు తెలిపారు. పంట చేతికి వచ్చిన సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తోటను కాల్చివేశారని రోధిస్తున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశానని తోట యజమాని రామారావు తెలిపారు.

విలేకరిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో ఎలక్ట్రానిక్ మీడియా విలేకరిగా విధులు నిర్వహిస్తున్న వమరవెల్లి జగ్గునాయుడుపై ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. జగ్గు నాయుడికి ఓ బస్సు డ్రైవర్ మధ్య ట్రాఫిక్ విషయంలో తలెత్తిన చిన్న విషయాన్ని బస్సులో ఉన్న ప్రయాణికుడు కలుగజేసుకొని ముందుగా ఫోన్ సమాచారం ద్వారా తన అనుచరులకు తెలియజేసి వారితో కలిసి పట్టణంలోని వన్ వే జంక్షన్ వద్దకు బస్సు చేరుకోగానే గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు విలేకరి జగ్గు నాయుడుపై భౌతిక దాడికి పాల్పడి బట్టలను చించి వేసి దంతాలు ఊడినట్టు కొట్టి పిడి గుద్దులతో మెరుపు దాడి చేసారు. దీంతో బాధితుడు జగ్గు నాయుడు పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో తనపై జరిగిన దాడికి సంబంధించి ఫిర్యాదు చేశారు. జగ్గు నాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జొన్నవలస కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు చికిత్స నిమిత్తం పంపించి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

ఉద్ధండులు ఓటమిపాలు

ఎన్.జి రంగా


రాజగోపాలరావు

శ్రీకాకుళం: 1952లో పార్లమెంట‌కు తొలిసారిగా నిర్వహించిన ఎన్నికల్లో బొడ్డేపల్లి రాజగోపాలరావు స్వతంత్ర అభ్యర్థిగా బరిలోదిగి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పి.ఎల్.ఎన్.రాజుపై గెలుపొందారు. 1967లో బొడ్డేపల్లి రాజగోపాలరావు (కాంగ్రెస్)పై స్వతంత్ర పార్టీ తరపున పోటీ చేసిన సర్దార్ గౌతు లచ్చన్న తొలిసారి లోక్‌సభకు ఎన్నికయ్యారు. అప్పటి రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆయన రాజీనామా చేయడంతో శ్రీకాకుళం పార్లమెంట్ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. గుంటూరులో ఓటమిపాలైన గౌతు లచ్చన్న రాజకీయ గురువు ఎన్.జి.రంగాను ఆ ఎన్నికలో స్వతంత్ర పార్టీ తరపున బరిలో దిగారు. ఎన్.జి.రంగాను గౌతు లచ్చన్న ఆ ఎన్నికలో గెలిపించుకున్నారు. 1971 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బొడ్డేపల్లి రాజగోపాలరావు చేతిలో ఎన్.జి. రంగా ఓటమి పాలయ్యారు. 1985లో శ్రీకాకుళం నుంచి శాసనసభకు ఎన్.జి. రంగా పోటీ చేసి డిపాజిట్ కోల్పోయారు. టిడిపి ఆవిర్భావం తర్వాత 1984లో జరిగిన ఎన్నికల్లో టిడిపి తరపున పోటీ చేసిన అప్పయ్యదొర... కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బొడ్డేపల్లి రాజగోపాలరావుపై భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఆరుసార్లు ఎంపీగా ఎన్నికైన బొడ్డేపల్లి రాజగోపాలరావు 1991 ఉప ఎన్నికలో ఆమదాలవలస అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ ఎన్నికలో టిడిపి అభ్యర్థి తమ్మినేని సీతారాం ఆయను ఓడించారు.

టెక్కలిలో చిత్రవిచిత్రం

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎవ్వరు విజయం సాధించినా విపక్షీయులే కావడం గమనార్హం. 1952లో శాసనసభ ఏర్పడినప్పటి నుంచి పరిశీలిస్తే 2019 ఎన్నికల వరకు 17 మంది శాసనసభ్యుల్లో 8 మంది టిడిపికి చెందిన వారే. 1983లో టిడిపి ఆవిర్భావం జరిగినప్పటి నుంచి పరిశీలిస్తే 1983లో అట్టాడ జనార్ధనరావు నాయుడు, 1985లో వరదస రోజా, 1989లో దువ్వాడ నాగావళి, 1994లో నందమూరి తారక రామారావు, 1994 ఉప ఎన్నికల్లో హనుమంతు అప్పయ్యదొర, 1999లో కోర్ల రేవతీపతి, 2014, 2019లో కింజరాపు అచ్చెన్నాయుడు టిడిపి తరుపున విజయం సాధించారు. ఇక్కడ గమనించదగ్గ విషయం ఏమిటంటే హరిశ్చంద్రపురం నియోజకవర్గం నుంచి టెక్కలి నియోజకవర్గంగా విభజన జరిగినంత వరకు టెక్కలిని పాలించిన వారిలో సత్తారు లోకనాథం నాయుడు, అట్టాడ జనార్ధనరావు నాయుడు, బమ్మిడి నారాయణస్వామిలు, ప్రస్తుత ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు మినహా... మిగిలిన వారంతా పలాస మండలానికి చెందిన వారే. అంటే టెక్కలిని పాలించిన పదిహేడు మందిలో 13 మంది పలాస మండలానికి చెందిన వారే. ఇక్కడ గమనించదగ్గ విషయం ఏమిటంటే వీరిలో చాలామంది శాసనసభ్యులు అధికారంలో ఉంటే... రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీ అధికారంలో ఉండడం గమనార్హం.

పోస్టర్‌ను అందజేస్తున్న దువ్వాడ శ్రీనివాస్

'దువ్వాడ' విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి వైసిపిని ఆదరించాలని ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ ప్రజలకు కోరారు. కోటబొమ్మాళి పంచాయతీ పరిధిలో మంచాలపేట, సీతన్నపేట, ఉప్పరపేట గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజారంజక పాలన అందించి ప్రతి పేదవాడినీ ఆదుకున్నారన్నారు. ఆయన చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే మా విజయానికి శ్రీరామరక్షగా నిలుస్తాయన్నారు. ప్రజలు తిలక్‌కు, నాకు ఓ సారి అవకాశం ఇస్తే కింజరాపు పాలనకు, మా పాలనకు తేడా ఏమిటో అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు నూక సత్యారాజు, వైస్ ఎంపిపిలు దుక్క రోజా, బోయిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రసకందాయంలో ఎచ్చెర్ల రాజకీయం

ప్రజాశక్తి- రణస్థలం

జిల్లాలోని మరో కీలక నియోజకవర్గం ఎచ్చెర్ల సార్వత్రిక ఎన్నికలు, ఉప ఎన్నికలతో కలిపి ఇక్కడ 18 సార్లు ఎన్నికలు జరిగాయి. పరిశ్రమల ఖిల్లాగా పేరుగాంచిన ఈ నియోజకవర్గంలో గెలుపు ఎప్పుడూ ప్రధాన పార్టీలకు అత్యంత ప్రతిష్టాత్మకం. ఈ నియోజకవర్గంలో పురుషులు, మహిళలు కలిపి 2,42,637 మంది ఓటర్లు ఉన్నారు. ఈ నియోజకవర్గం ఏర్పాటైన దగ్గర నుంచి ఇప్పటి వరకు ఆరుసార్లు కాంగ్రెస్ పార్టీ విజయం సాధించగా, టిడిపి మరో ఆరుసార్లు విజయం సాధించింది. ప్రస్తుతం ఇక్కడ ఎమ్మెల్యేగా వైసిపికి చెందిన గొర్లె కిరణ్‌కుమార్ వ్యవహరిస్తున్నారు.

ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఇప్పటి వరకు సాధారణ, ఉప ఎన్నికలతో కలిపి 18 సార్లు ఎన్నికలలు జరిగాయి. 1962లో జరిగిన తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన కె.పున్నయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1964లో జరిగిన ఎన్నికల్లో కె.నరసయ్య కాంగ్రెస్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన కె.నారాయణపై 7,242 ఓట్ల తేడాతో ఆయన విజయం సాధించారు. 1967లో జరిగిన ఎన్నికల్లో ఈ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన సి.సత్యనారాయణ తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఎల్.లక్ష్మణదాస్‌పై 3,065 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1972లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఎల్.లక్ష్మణదాస్ తన సమీప ప్రత్యర్థి ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన అక్కయ్యనాయుడిపై 4,419 ఓట్ల తేడాతో విజయాన్ని దక్కించుకున్నారు. 1978లో జరిగిన ఎన్నికల్లో జనతా పార్టీ నుంచి పోటీ చేసిన కె.నరసయ్య విజయాన్ని దక్కించుకున్నారు. కాంగ్రెస్ నుంచి బరిలోకి దిగిన 9,791 ఓట్ల తేడాతో బి.నరసింహులపై విజయం సాధిం చారు.



1983లో జరిగిన ఎన్నికల్లో టిడిపి నుంచి పోటీ చేసిన కె.ప్రతిభా భారతి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఎస్.నారాయణపై 25,152 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1985లో జరిగిన ఎన్నికల్లో టిడిపి నుంచి పోటీ చేసిన కె.ప్రతిభాభారతి మరోసారి విజయం సాధించారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన సి.విజయలక్ష్మిపై 26,947 ఓట్ల తేడాతో విజయం దక్కించుకు న్నారు. 1994లో జరిగిన ఎన్నికల్లో టిడిపి నుంచి పోటీ చేసిన కె.ప్రతిభాభారతి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కె.మురళీమోహన్‌పై 10,794 ఓట్ల తేడాతో విజయాన్ని దక్కించుకున్నారు. 2004లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కె.మురళీమోహన్ తన సమీప ప్రత్యర్థి టిడిపి నుంచి పోటీ చేసిన ప్రతిభాభారతిపై 5,689 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 2009లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన మీసాల నీలకంఠంనాయుడు విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి టిడిపి నుంచి పోటీ చేసిన ఎస్.సూర్యనారాయణరెడ్డిపై 15,015 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 2014లో జరిగిన ఎన్నికల్లో టిడిపి నుంచి పోటీ చేసిన కిమిడి కళా వెంకటరావు ఇక్కడి నుంచి విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి వైసిపి నుంచి పోటీ చేసిన గొర్లె కిరణ్ కుమార్‌పై 4,741 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసిపి బరిలో దిగిన గొర్లె కిరణ్ కుమార్ ఇక్కడ విజయాన్ని దక్కించుకున్నారు. తన సమీప ప్రత్యర్థి టిడిపి నుంచి పోటీ చేసిన కిమిడి కళావెంకటరావుపై 18,711 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఎచ్చెర్ల అసెంబ్లీ స్థానంలో ఇప్పటి వరకు 18 సార్లు ఎన్నికలు జరిగాయి. ఆయా ఎన్నికల్లో ఆరు సార్లు కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించగా, ఆరు సార్లు టిడిపి అభ్యర్థులు గెలుపొందారు. తొలి రెండు ఎన్నికల్లో కె.నరసయ్య కాంగ్రెస్ నుంచి విజయం సాధించారు. టిడిపి నుంచి పోటీ చేసిన కె.ప్రతిభాభారతి ఈ నియోజకవర్గం నుంచి వరుసగా ఐదుసార్లు విజయం సాధించారు. 1983 నుంచి 1999 వరకు జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ ఆమె విజయాన్ని నమోదు చేశారు. 1999 ఎన్నిక తరువాత శాసనసభ స్పీకర్‌గా ఈమె పనిచేశారు. 2014లో జరిగిన ఎన్నికల్లో ఇక్కడ నుంచి విజయం సాధించిన కిమిడి కళా వెంకటరావు మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం మ్మెల్యేగా వైసిపికి చెందిన గొర్లె కిరణ్ కుమార్ కొనసాగుతున్నారు. వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ అభ్యర్థులు విజయం సాధిస్తారన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.

టిడిపి టిక్కెట్ బిజెపికి బదలాయింపు

ఎచ్చెర్ల నియోజకవర్గం అసెంబ్లీ స్థానానికి టిడిపి సీనియర్ నాయకుడు, మంత్రి, పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకటరావుకి వస్తుందని టిడిపి నాయకులు, కార్యకర్తలు భావించారు. అయితే టిడిపి, జనసేన, బిజెపి జతకట్టడంతో బిజెపి టిక్కెట్ మండలంలోని నడుకుదిటిపాలెంకు చెందిన నడుకుదిటి ఈశ్వరరావుకు కేటాయించారు. కిమిడి కళావెంకటరావుకి చిపురుపల్లి అసెంబ్లీ స్థానానికి, కలిశెట్టి అప్పలనాయుడుకి విజయనగరం ఎంపీ స్థానానికి టిక్కెట్లు టిడిపి అధిష్టానం కేటాయించింది. ఏదేమైనా ఎచ్చెర్ల నియోజకవర్గంలో అధికార పార్టీ అభ్యర్థి సిటింగ్ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు, కాంగ్రెస్ ఫోరం అభ్యర్థి మల్లేశ్వరావుల మధ్య పోటీ నెలకుంది. ఈ సారి ఎచ్చెర్ల నియోజకవర్గం పీఠాన్ని ఎవరు అలంకరించనున్నారో వేసి చూడాల్సిందే.

రాజకీయాల్లో టెక్కలి

ప్రజాశక్తి- టెక్కలి



రాజకీయాల్లో టెక్కలి నియోజకవర్గానికి ఒక చరిత్ర ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టెక్కలి శాసనసభకు ఒక ప్రత్యేకత ఉంది. టిడిపి వ్యవస్థాపకులు కీర్తిశేషులు నందమూరి తారక రామారావు టెక్కలి ఎమ్మెల్యేగా 42 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. స్థానికేతరులు పోటీ చేసి అత్యంత మెజార్టీతో విజయం సాధించడం గమనించదగ్గ విషయం. అయితే తర్వాత స్థానికులు పోటీ చేసినా ఇంతవరకు ఆ రికార్డుని ఎవ్వరూ బద్ధలు కొట్టకపోవడం మరో విశేషం. ఎన్‌టిఆర్ రాజీనామా అనంతరం ఏర్పడిన ఉప ఎన్నికల్లో భార్య లక్ష్మీపార్వతి, కుమారుడు నందమూరి హరికృష్ణలు పోటీ చేస్తామని ప్రచారమైంది. దీంతో టెక్కలి నియోజకవర్గం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒక చర్చనీయాంశంగా మారి గుర్తింపు సంపాదించుకుంది. టిడిపి హయాంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన 'ప్రజల వద్దకు పాలన' కార్యక్రమానికి నాంది పలికింది టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం. ఇక్కడ మరో గమ్మత్తు అయిన విషయం ఏమిటంటే ఎన్‌టిఆర్‌ని పదవీచ్యుడితిని చేయడానికి భీజం పడి ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేసి చంద్రబాబు నాయుడుకి మద్దత్తు నిచ్చే క్రమంలో ఇక్కడ నుంచే వైశ్రాయి హోటల్‌కు వెళ్లడం గమనార్హం. టిడిపి రాష్ట్ర అధ్యక్షునిగా ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు ఎంపికయ్యారు. ఏదేమైనా టెక్కలి నియోజకవర్గం అంటే రాజకీయాల్లో ఒక స్పెషల్.

ప్రచారం నిర్వహిస్తున్న శ్రావ్య, స్వాతి

అభ్యర్థుల సతీమణుల ప్రచారం

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకునేందుకు టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఎంపి రామ్మోహన్ నాయుడు సతీమణి కింజరాపు శ్రావ్య పిలుపు నిచ్చారు. ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ సతీమణి స్వాతితో కలిసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. బ్యాంకర్స్ కాలనీ అభివృద్ధి టిడిపి పాలనలోనే సాధ్యమైందని గుర్తు చేశారు. నగర విస్తరణలో భాగంగా కాలనీల్లో గతంలో పెద్దఎత్తున నిధులిచ్చి రోడ్లు, ఇతర మౌళిక వసతులు కల్పించడం జరిగిందని గుర్తు చేశారు. టిడిపి అంటేనే అభివృద్ధి అని అందుకోసం ఎంపి అభ్యర్థిగా పోటీలో ఉన్న తన భర్త రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్‌లను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సింతు సుధాకర్, తమ్మినేని సుజాత, కోరాడ రమేష్, అరవల రవీంద్ర, ముద్దాడ రామకృష్ణ, విభూది సూరిబాబు పాల్గొన్నారు.

గాంధీ సమక్షంలో వంద కుటుంబాలు చేరిక

ఆమదాలవలస : మండలంలోని గరిమెళ్ల కొత్తవలస గ్రామ పంచాయతీ వైసిపి సర్పంచ్ పంగ సుగుణ, ఉప సర్పంచ్ సిరిపురపు చంద్ర కళ ఆధ్వర్యాన వంద కుటుంబాలు శనివారం రాత్రి స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ సమక్షంలో చేరి ఆయనకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుగుణ మాట్లాడుతూ స్థానిక శాసన సభ్యుడు నియంతృత్వ

గాంధీ సమక్షంలో చేరిన జి.కె వలస గ్రామస్తులు

ధోరణితో విసిగి పోయ మన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో అభివృద్ధికి నోచుకోక పంచాయతీ దూరమైందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే వైసిపిని వీడి స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీకి మద్దతుగా ఆయన సమక్షంలో చేరామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి గాంధీ గెలుపునకు శక్తివంచన లేకుండా తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. అన్నెపు సూరిబాబు, సువ్వారి అనీల్, పేడాడ పూర్ణారావు పాల్గొన్నారు.

చట్టాలు.. శిక్షలు

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వాన్ని ఎన్నుకోవడానికి ఎన్నికలే ప్రధాన భూమిక. ఈ ఎన్నికల నియమావళిని రూపొందించి పకడ్బందీగా అమలు చేయడానికి ఎన్నికల కమిషన్ పనిచేస్తుంది. ఎన్నికల నియమావళిని ఎవరు అతిక్రమించినా చట్టం తన పని తాను చేస్తుంది. ఎన్నికల సమయంలో ప్రజాప్రాతినిధ్య చట్టంలోని నిబంధనల ప్రకారం ఎక్కువగా కేసులు నమోదు చేస్తుంటారు. ఈ చట్టంలో అనేక సెక్షన్లు ఉన్నప్పటికీ ఎన్నికల సమయంలో కొన్నింటిని ఎక్కువగా నిబంధనలు అతిక్రమించిన పార్టీలపైనా, వ్యక్తులపైనా ప్రయోగిస్తుంటారు. ఆ చట్టాలేంటో.. వాటికేసే శిక్షలేంటో... ఓసారి పరిశీలిద్దాం.

– ప్రజాశక్తి, శ్రీకాకుళం

☞ **123 - ఆర్‌పి యాక్ట్**

లంచగొండితనం, అనుచిత ఒత్తిడి, మతం, జాతి, కులం, సంఘం లేదా భాషా ప్రాతిపాదికపై పౌరుల మధ్య ద్వేషాన్ని, శత్రుత్వాన్ని పెంపొందించడం, లేక ప్రయత్నించడం చేస్తే దీన్ని ప్రయోగిస్తారు.

☞ **125 - ఆర్‌పి యాక్ట్**

ఎన్నికల సందర్భంగా వివిధ గ్రూపుల మధ్య శత్రుత్వాన్ని పెంపొందిస్తే మూడేళ్ల జైలు శిక్ష. జరిమానా. లేదా రెండూ అమలు చేయొచ్చు.

☞ **125అ - ఆర్‌పి యాక్ట్**

తప్పుడు సమాచారం ఇచ్చినందుకు ఆరు నెలల జైలు శిక్ష. జరిమానా. లేదా రెండూ అమలు చేస్తారు.

☞ **126 - ఆర్‌పి యాక్ట్**

ఎన్నికల సమయానికి 48 గంటల ముందు బహిరంగంగా సభలు నిర్వహించినా శిక్షార్హులే. అందుకు రెండు సంవత్సరాల జైలు శిక్ష. జరిమానా. లేదా రెండూ అమలు చేయొచ్చు.

☞ **127 - ఆర్‌పి యాక్ట్**

ఎన్నికల సమావేశం సందర్భంగా ఎటువంటి అల్లర్లకు పాల్పడినా ఏ పోలీస్ అధికారి అయినా యుఎస్ 42 సిఆర్‌పిసి ప్రకారం ఆ వ్యక్తులను అరెస్టు చేయొచ్చు. అందుకు ఆరు నెలల జైలు శిక్ష. రెండు వేల జరిమానా. లేకుంటే రెండూ అమలు చేయొచ్చు.

☞ **127అ - ఆర్‌పి యాక్ట్**

ఎవరైనా తన పేరు, చిరునామా లేకుండా ఎన్నికల కరపత్రాలు, పోస్టర్లు ముద్రిస్తే ఆరు నెలల జైలు శిక్ష. రెండు వేల రూపాయల జరిమానా. లేదా రెండూ అమలు చేయొచ్చు.

☞ **128 - ఆర్‌పి యాక్ట్**

బహిరంగంగా ఓటేస్తే 3 నెలల జైలు శిక్ష. జరిమానా. లేకుంటే రెండూ అమలుకు అవకాశముంది.

☞ **129 - ఆర్‌పి యాక్ట్**

ఎన్నికలకు సంబంధించిన అధికారులు, పోలీసులు పోటీచేసే అభ్యర్థికి సహకరించినా లేదా ప్రభావం కలిగించినా వారూ శిక్షార్హులే. అందుకు మూడు నెలల జైలు. జరిమానా. లేకుంటే రెండూ అమలు చేయొచ్చు.

☞ **130 - ఆర్‌పి యాక్ట్**

పోలింగ్ స్టేషన్‌కు 100 మీటర్లలోపు ప్రచారం చేయకూడదు. ఒక వేళ ప్రచారం చేస్తే రూ.250 జరిమానా విధిస్తారు.

☞ **131 - ఆర్‌పి యాక్ట్**

పోలింగ్‌స్టేషన్‌కు దగ్గరలో నియమాలకు వ్యతిరేకంగా ఎటువంటి ప్రచారం చేస్తే ఏ పోలీస్ అధికారి అయినా ఆ సామగ్రిని స్వాధీనం చేసుకోవచ్చు. అందుకు మూడు నెలల జైలు. జరిమానా. లేకుంటే రెండూ అమలు చేయొచ్చు.

☞ **132 - ఆర్‌పి యాక్ట్**

ఓటేసే సమయంలో నియమ నిబంధనలు పాటించని వారికి మూడు నెలల జైలు శిక్ష. జరిమానా. లేదా రెండూ అమలు చేయొచ్చు.

☞ **133 - ఆర్‌పి యాక్ట్**

ఎన్నికల సందర్భంగా ప్రజలను పోలింగ్ బూత్ వద్దకు చేరవేసేందుకు అక్రమంగా వాహనాలు సమకూర్చుట, అద్దెకు తీసుకొనుట నేరం. అందుకు మూడు నెలల జైలు శిక్ష. జరిమానా. లేకుంటే రెండూ అమలు చేస్తారు.

☞ **134 - ఆర్‌పి యాక్ట్**

ఎన్నికల సందర్భంగా అధికార దుర్వినియోగం చేస్తే శిక్షార్హులే. అందుకు రూ.500 వరకు జరిమానా వేయొచ్చు.

☞ **134అ - ఆర్‌పి యాక్ట్**

ప్రభుత్వ ఉద్యోగి ఎన్నికల ఏజెంట్‌గా గానీ, పోలింగ్ ఏజెంట్‌గా గానీ, ఓట్ల లెక్కింపు సందర్భంగా ఏజెంట్‌గా గానీ వ్యవహరించినా శిక్షకు అర్హులు. అందుకు మూడు నెలల జైలు శిక్ష. జరిమానా. లేదా రెండూ అమలు చేయొచ్చు.

☞ **134ఆ - ఆర్‌పి యాక్ట్**

పోలింగ్ స్టేషన్ పరిసర ప్రాంతాలకు మారణాయుధాలు కలిగి వెళ్లడం నిషేధం. అతిక్రమించి వెళ్తే రెండు నెలల జైలు శిక్ష. లేదా జరిమానా. లేదా రెండూ అమలు చేయొచ్చు.

☞ **135 - ఆర్‌పి యాక్ట్**

పోలింగ్ స్టేషన్ నుంచి ఇవిఎం అపహరించినా శిక్ష పడుతుంది. సంవత్సరం జైలు శిక్ష. రూ.500 జరిమానా. లేదా రెండూ అమలు చేయొచ్చు.

☞ **135అ - ఆర్‌పి యాక్ట్**

పోలింగ్ బూత్‌ను స్వాధీన పరుచుకోవడం. ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండి ఈ నేరం చేస్తే శిక్ష పడుతుంది. అందుకు సంవత్సరం తగ్గకుండా ఐదేళ్ల వరకు జైలు శిక్ష.

☞ **135ఆ - ఆర్‌పి యాక్ట్**

ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్నికల రోజు వేతనపు సెలవుగా మంజూరు చేసినా శిక్ష. అందుకు ఐదు వేల రూపాయల వరకు జరిమానా విధించవచ్చు.

☞ **135ఇ - ఆర్‌పి యాక్ట్**

పోలింగ్ రోజు, కౌంటింగ్ రోజు మద్యం విక్రయించడం, పంపిణీ చేయడం నేరం. అందుకు ఆరు నెలల జైలు శిక్ష. రెండు వేల రూపాయల వరకు జరిమానా. లేదా రెండూ అమలు చేయొచ్చు.

డ్వాక్రా ఓటర్ల పైనే నేతల చూపు

- **నియోజకవర్గంలో 46,311 మంది మహిళా సభ్యులు**
- **డ్వాక్రా ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో ప్రధాన పార్టీలు**

ప్రజాశక్తి- బూర్జ



నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారాలు పతాకస్థాయికి చేరుకున్నాయి. గెలుపు కోసం ప్రధాన పార్టీతో పాటు స్వతంత్ర పార్టీల అభ్యర్థులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ముఖ్యంగా మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు. అన్నింటిలోనూ ముందంజలోనే ఉంటున్నారు. ప్రస్తుతం జరగబోయే ఎన్నికల్లో కూడా వారి ఓట్లు సగం శాతం కంటే అధికంగానే ఉండడంతో ప్రధాన పార్టీలు వారిని ఆకట్టుకునేందుకు ప్రణాళికను రచిస్తున్నారు. నియోజవర్గం సగభాగం మహిళా ఓటర్లు ఉన్నారు. ఎన్నికల్లో మహిళల ఓట్లే కీలకంగా మారనున్నాయి. అందులోను పల్లెల్లో పొదుపు సంఘాల్లో మహిళలు అధికంగా ఉండడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఆ దిశగా ప్రచారాన్ని మమ్మరం చేస్తున్నారు. అభ్యర్థుల విజయంలో డ్వాక్రా సంఘాల సభ్యులు కీలకపాత్ర పోషిస్తున్నారు. డ్వాక్రా మహిళలు ఓట్లను తమ పార్టీకి అనుకూలంగా మార్చుకోవాలనే ఉద్దేశంతో ప్రధాన పార్టీలైన టిడిపి, వైసిపి, కాంగ్రెస్ పార్టీలు ఆలోచనలు చేస్తున్నాయి. అలాగే ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి.

46, 311 మంది డ్వాక్రా సభ్యులు

ఆమదాలవలస నియోజకవర్గ పరిధిలో ఆమదాలవలస, బూర్జ, పొందూరు, సరుబుజ్జిలి మండలాలు ఉన్నాయి. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో పొదుపు సంఘాలు పనిచేస్తున్నాయి. వీటి పరిధిలో 4, 899 పొదుపు సంఘాలు ఉండగా 54, 627 మంది మహిళలు డ్వాక్రా గ్రూపుల్లో సభ్యులుగా ఉన్నారు. వీరంతా ఓటర్లుగా నమోదై ఉండడంతో ఈ ఎన్నికల్లో వీరే కీలకంగా వ్యవహరించనున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఎన్నికల్లో అభ్యర్థులు ప్రచారాలను కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా మహిళలను కలుసుకొని ఓట్లు అభ్యర్థించడం కనిపిస్తుంది. మరోవైపు వచ్చే నెల 13న ఎన్నికలు ఉండగా ఈ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం ప్రచారం నిర్వహిస్తుంది. ప్రధాన రాజకీయ పార్టీలు తాము అధికారానికి వస్తే స్వయం సహాయక సంఘాలను మరింత ఆర్థికంగా చేయూత అందిస్తామని, బలోపేతం చేస్తానని, మహిళల ఆర్థిక స్వావలంబనకు అండగా నిలుస్తామని ప్రచారాల్లో వాగ్దానాలు గుప్పిస్తున్నారు.

మహిళా సాధికారతకు కృషి చేయాలి

ఏ పార్టీలైనా అధికారంలో వచ్చిన తర్వాత మహిళా సాధికారితకు కృషి చేయాలి. ముఖ్యంగా మహిళా అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. ఓటుహక్కు వినియోగించు కోవడంపై అవగాహన పెరిగింది. రానున్న ఎన్నికల్లో మహిళలకు మంచి చేసే పార్టీకి ఓటు వేస్తాం.

- బాలి లక్ష్మి, అన్నంపేట, డ్వాక్రా మహిళ

మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలి



మహిళలకు అన్ని రంగాల్లోనూ ప్రాధాన్యత ఇవ్వాలి. ముఖ్యంగా మహిళల అభివృద్ధికి కృషి చేయాలి. ఏకాభిప్రాయంతోనే మంచి పార్టీకి ఓటు వేస్తాం. ఓటుహక్కు వినియోగించు కోవడంపై అవగాహన పెరిగింది.

- లింగిపల్లి తవుడమ్మ, కాఖండ్యాం, డ్వాక్రా మహిళ

పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఇఒ ధనుంజయ

ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష ప్రశాంతం

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని రాజపురంలో ఉన్న ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్టు ప్రిన్సిపాల్ ఎం.ఈశ్వం రావు తెలిపారు. ఈ పరీక్షకు 187 దరఖాస్తు చేసుకోగా, 181 మంది హాజరైనట్టు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాన్ని మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

బూర్జ: మండలంలోని ఒవిపేట మోడల్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 272 మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ బి.శ్రీని వాసరావు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న 164 మోడల్ స్కూల్ 2024-2025 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతిలో ప్రవేశ పరీక్ష కోసం ఆన్‌లైన్‌లో 283 మంది దరఖాస్తు చేసుకున్నారని, 11 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. 272 మంది పరీక్ష రాశారని, పరీక్ష ఫలితాలు విద్యాశాఖ వెల్లడించిన తర్వాత పరీక్షలో ఉత్తీర్ణులై ఎంపికైన విద్యార్థులకు సమాచారం తెలియ జేస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

పొందూరు: మండలంలోని వావిలపల్లి పేట వద్ద గల ఎపి మోడల్ స్కూల్లో ఆదివారం ఆరో తరగతి ప్రవేశ పరీక్షను నిర్వహించారు. ఈ ప్రవేశ పరీక్షకు 271 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా 250 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ హెచ్. ప్రభాకర్ తెలిపారు.

స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలతో పోలీసులు

పోలీసుల కార్డాన్‌సెర్చ్

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని కొత్తకోట గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున ఎస్ఐ బి.నిహార్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో పలు గృహాల వద్ద ఉన్న ద్విచక్ర వాహనాలను గుర్తించి యజమానుల నుంచి పత్రాలను అడిగి పరిశీలించారు. పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 11 ద్విచక్ర వాహనాలకు ఎటువంటి పత్రాలు లేకపోవడంతో వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నిహార్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసేటప్పుడు వాహనానికి సంబంధించిన పత్రాలు అన్ని సరిచూసుకోవాలని, ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు మైనర్లుకు ఇవ్వకూడదన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ చంద్రునాయుడు, హెచ్‌సి రవిశంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: పట్టణంలోని బెల్లుపడ ప్రాంతంలో కాశీబుగ్గ డిఎస్‌పి నాగేశ్వరరావురెడ్డి ఆధ్వర్యాన ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. దీంతో బెల్లుపడ ప్రాంతంలో అన్ని వాహనాలనూ తనిఖీ చేశారు. తనిఖీల్లో ఎటువంటి పత్రాలు లేకుండా ఉన్న 12 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో పోలీస్ అధికారులు బెల్లుపడలో కార్డెన్ సెర్చ్ నిర్వహించడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వైసిపికి చెందిన కీలక నేతలు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు ప్రాధాన్యత సంతరించుకుంది. సిఐ టి.ఇమ్మాన్యూనల్ రాజు, పట్టణ, రూరల్ ఎస్ఐలు సత్యనారాయణ, లక్ష్మణరావు పాల్గొన్నారు.

పట్టుబడిన వాహనాలు

పని ప్రదేశాల్లో పందిరి ఏర్పాటు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- పొందూరు

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి సంబంధించి చేపట్టే పని ప్రదేశాల్లో కూలీలు ఎండ నుంచి ఉపశమనం పొందేలా నీడను కల్పిస్తూ పందిరిలను అధికారులు ఏర్పాటు చేశారు. విపరీతమైన ఎండల నేపథ్యంలో పని ప్రదేశాల్లో వసతుల లేమిపై ప్రజాశక్తి దినపత్రికలో 'మండే ఎండ...కూలీలకు ఏది అండ..? అంటూ ఆదివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వేసవి నేపథ్యంలో భానుడు ప్రతాపంతో విపరీతంగా ఎండలు మండుతున్నాయి. గతంలో ఉపాధి పని ప్రదేశాల్లో ఎండల నుంచి కాస్త ఉపశమనం పొందేందుకు టెంట్లును సరఫరా చేసేవారు. కాని గత కొన్నేళ్లుగా వాటిని సరఫరా చేయక పోవడంతో పనిచేసే

కొంచాడలో పని ప్రదేశంలో కర్రలతో ఏర్పాటు చేసిన పందిరి

కూలీలు ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు సమీపంలో ఉన్న చెట్లు కింద నీడలో సేద తీరుతున్నారు. దీంతో మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న పని ప్రదేశాల్లో కర్రలు, తాటికమ్మలతో పందిరిలను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఎండలో పనిచేసి అలసిపోయిన తమకు కాస్తా సేదతీరేందుకు ఈ పందిరిలు ఎంతగానో ఉపయోగ పడతాయని కూలీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దాం

ప్రజాశక్తి- రణస్థలం

మనం నిత్య జీవితంలో విచక్షణా రహితంగా వాడి పారేస్తున్న పాలిథిన్ సంచులు, ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కరగడానికి సుమారు అయిదు వందల ఏళ్లు పడుతుందని హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సంస్థ కన్వీనర్ ఆర్.హరిబాబు అన్నారు. ప్రతిఏటా ఏప్రిల్ 22న ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్న ధరిత్రీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రణస్థలంలో పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు, చిరు వ్యాపారస్తులు, దుకాణదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశంలో ప్రతిఒక్కరి తలసరి ప్లాస్టిక్ వినియోగం సుమారు 11 కేజీలని, ఒక్కసారి వాడి పారేసే పాలిథిన్ సంచులు భూమిపై పేరుకుపోవడం వలన ఏటా కొన్ని లక్షల మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా పాలిథిన్ సంచుల వలన వర్షపు నీరు భూమిలో ఇంకడం లేదని, దీనివలన భూగర్భ జలాల క్షీణతకు ప్రత్యక్షంగా మనమే కారణం అవుతున్నామన్నారు. ప్రతిఒక్కరూ విచక్షణతో మెలిగి

వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న హరిబాబు

మార్కెట్‌కు వెళ్ళేటప్పుడు చేతి సంచిని తీసుకుని వెళ్ళడం అలవాటు చేసుకుంటే పాలిథిన్ వినియోగాన్ని తగ్గించగలమని సూచించారు. ఈ సందర్భంగా రణస్థలం మార్కెట్‌లో 100 మందికి హరిత సొసైటీ లోగోతో కూడిన గుడ్డ సంచులను ఉచితంగా పంపిణీ చేశారు. పర్యావరణ హితమైన గుడ్డ సంచులు కావల్సిన వారు తమ సంస్థ కార్యాలయం నెంబరు 8885328194ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హరిత సొసైటీ వైస్ ప్రెసిడెంట్ చల్లా త్రినాథ్, కోశాధికారి సాడి రమణ, సభ్యులు ఎం.అప్పల నాయుడు పాల్గొన్నారు.

సీతమ్మ మృతదేహం

పెళ్లింట విషాదం

- విద్యుదాఘాతంతో మహిళ మృతి
- మరో పది మందికి గాయాలు

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని అల్లివలసలో ఓ పెళ్లింట విషాదం చోటు చేసుకుంది. విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందగా, మరో పది మందికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే... అల్లివలసలో మైలపల్లి పోలీసు వివాహం జరుగుతుంది. ఆ వివాహానికి బంధువులు హాజరయ్యారు. ఉదయం నుంచి బంధువులు, గ్రామస్తులు ఆనందంగా గడిపారు. రాత్రి ముహూర్తం కావడంతో పెళ్లిపీటలపై వధువు, వరుడు కూర్చున్నారు. బంధువులంతా ఆనందగా గడిపారు. పురోహితులు మైక్‌లో మంత్రాలు చదువుతున్నారు. ఒక్కసారిగా మైక్‌కు విద్యుత్ సరఫరా కావడంతో షాక్ గురయ్యారు. పురోహితులు పక్కనే కూర్చున్న లావేరు మండలం బెజ్జిపురానికి చెందిన అంబటి సీతమ్మ (45) అక్కడికక్కడే మృతి చెందింది. మరో పది మందికి గాలయ్యాయి. క్షతగాత్రులను కుటుంబ సభ్యులు ఓ ప్రయివేటు వాహనంలో స్థానిక సూర్య ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.

ఇంత నిర్లక్ష్యమా?

బూర్జ: పాలకొండ-శ్రీకాకుళం ప్రధాన రహదారిపై ఆటోల్లో వెదురు కర్రలు, సిమెంట్ స్తంభాలు, ఇనుప గజాలు వంటివి రవాణా చేస్తున్నారు. అయితే ఆటోల్లో వెనుక భాగానికి గజాలను, సిమెంట్ స్తంభాలను, వెదురు కర్రలను విడిచిపెట్టడంతో పలు ప్రమాదాలకు దారితీస్తున్నాయి. పలు గ్రామాల వద్ద రహదారి గోతులమయంగా తయారయింది. ఇప్పటికే పలు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి.

'సూపర్ సిక్స్‌'పై ప్రచారం

ఆమదాలవలస : సూపర్ సిక్స్ పోస్టర్లను చూపిస్తున్న గీత

ప్రజాశక్తి- పొందూరు

మండలం మలకాంలో ఆదివారం టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ సతీమణి, మాజీ ఎంపిపి కూన ప్రమీల ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ జాడ శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షులు చిగిలిపల్లి రామ్మోహన్, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కూన వెంకట సత్యనారాయణ, టిఎన్‌టియూసి జిల్లా అధ్యక్షులు నారాయణరావు, జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కరరావు, టిడిపి మండల ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరి, దుంపల సన్యాసిరావు, పైడి రాంబాబు, కాలెపు శ్రీనివాసరావు, జాడ మురళీ పాల్గొన్నారు.

ఆమదాలవలస: రాష్ట్రంలో జగన్ రెడ్డి అవినీతి పాలనతో రాష్ట్ర ఖజానా ఖాళీ అయ్యిందని మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత అన్నారు. పట్టణ పరిధి 21వ వార్డు కుద్దిరాంలో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రానున్న ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే కూన రవికుమార్‌లకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కింజరాపు సుప్రియ, తమ్మినేని విద్యాసాగర్, బోర గోవిందరావు, నాగళ్ల మురళీధర్, పొన్నాడ రామారావు పాల్గొన్నారు.

మండలంలోని కొత్తవలసలో మాజీ సర్పంచ్ గురుగుబెల్లి మోహనరావు ఆధ్వర్యంలో టిడిపి మండల నాయకులు నూక రాజు, సనపల ఢిల్లేశ్వరరావు, తమ్మినేని చంద్రశేఖర్‌లు బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ, సూపర్ సిక్స్ పథకాల అమలుపై ఇంటింటికి వెళ్లి పోస్టర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు అన్నెపు భాస్కరరావు, నేతింటి జ్యోతి, అప్పల నాయుడు, చెల్లం నాయుడు, బుజ్జి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: మండలంలోని పాలవలస పంచాయతీ 5వ క్లస్టర్‌కు చెందిన గ్రామ వాలంటీర్ అడివరపు రాజబాబు టిడిపిలో చేరారు. ఇటీవల వాలంటీర్ రాజబాబు తన విధులకు రాజీనామా చేశాడు. ఆదివారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి శివ్వాల సూర్యనారాయణ ఆధ్వర్యంలో పెద్దపాలెం, పాలవలస, రావివలసలో బాబూ ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపిలో చేరిన రాజబాబుకు సూర్య నారాయణ టిడిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వాలంటీర్ రాజబాబుతో పాటు మరో 10 కుటుంబాలు టిడిపిలో చేరారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు రాంబాబు, లావేటి పూర్ణారావు, వెంకటరావు, రామారావు, తిరుమలరావు పాల్గొన్నారు.

పొందూరు : మలకాంలో ప్రచారం చేస్తున్న ప్రమీల

ఇచ్ఛాపురం : టిడిపి ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి బెందాళం అశోక్‌కు మద్దతుగా మున్సిపాలిటీ 16వ వార్డులో లక్ష్మణ్ రవి, రవికుమార్ గౌర్, కాళ్ల ధర్మారాజు, బుద్దాల నిర్మలారెడ్డి, సాలిన ఢిల్లీ, కొండా శంకర్, ఆశి లీలారాణి తదితరులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని టిడిపి కార్యాలయంలో పురపాలక సంఘంలోని 12వ వార్డు లక్ష్మీ నగర్ వీధికి చెందిన టిడిపి నాయకురాలు బోయిన సునీత ఆధ్వర్యంలో సంకు శరత్ మరో 50 మంది యువకులు వైసిపిని వీడి టిడిపిలో కూన ప్రమీల సమక్షంలో ఆదివారం చేరారు. ఈ సందర్భంగా

పార్టీలో చేరిన వారితో ప్రమీల

ఆమె మాట్లాడుతూ టిడిపితోనే యువతకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు రాష్ట్ర బాలల హక్కుల మాజీ సభ్యుడు పి.వి.వి.ప్రసాద్, సువ్వారి ఢిల్లేశ్వరరావు, కిల్లి శేషు, అన్నెపు భాస్కరరావు, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

పలాస : అప్పలరాజుకు గజమాల వేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి- పలాస

డిసిసిబి మాజీ డైరెక్టర్, పలాస పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు సిర్ల రవిచంద్ర (బుజ్జి) తన అనుచరులతో కలిసి ప్రగతిభవన్ వద్ద ఆదివారం మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సమక్షంలో వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి మంత్రి అప్పలరాజు కండువాలు కప్పి సాధారణంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2017లో తాను రాజకీయాల్లోకి వచ్చిన కాలంలో ఒక్కొక్కరిగా వచ్చి తనకు రాజకీయాలలో సహకారం అందించారని అన్నారు. అందులో బుజ్జి కూడా ఉన్నారని తెలిపారు. అనంతరం మాకు కలవడం కొంత జాప్యం ఏర్పడిందన్నారు. రవిచంద్ర మాట్లాడుతూ తాను అప్పయ్యదొర వంటి నాయకులతో కలిసి పనిచేశానని గుర్తు చేశారు. కార్యక్రమంలో హనుమంతు వెంకటరావు, వైస్ చైర్మన్ బుజ్జి, ఎస్వి గ్రూప్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, జెసిఎస్ కన్వీనర్ బల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అలాగే పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని శివాజీనగర్‌లో యార్లగెడ్డ వద్దు... అప్పలరాజు ముద్దు అనే నినాదంతో టిడిపి నుంచి వైసిపిలోకి చేరారు. వీరికి అప్పలరాజు వైసిపి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బోర బుజ్జి, పట్టణ అధ్యక్షులు సనపల సింహాచలం, కౌన్సిలర్ సవర సోమేశ్వరరావు, భోగేశ్వరరావు, బదకల బాలమ్మ, పులిరాజ్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలోని అమీన్ సాహెబ్‌పేటకు చెందిన బొండడ మహేష్ రెండు వందల మందితో జనసేన నుంచి వైసిపిలోకి చేరారు. స్థానిక ఆర్‌జె ఫంక్షన్ హాల్ మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎమ్మెల్సీ నర్తు రామారావు వారికి వైసిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నరేష్ కుమార్ అగర్వాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్లు భారతి దివ్య, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, నర్తు నరేంద్రయాదవ్, ప్రకాశరావు పట్నాయక్, సాలీనా ఢిల్లీ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : వైసిపి కండువా వేస్తున్న సాయిరాజ్

విజయ గెలుపే లక్ష్యం

కవిటి : మాట్లాడుతున్న పిరియా విజయ

కవిటి: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైసిపి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అభ్యర్థి పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు కోరారు. కవిటిలోని అగ్నికుల క్షత్రియ సంఘం సామాజిక భవనంలో వైసిపి నాయకులతో, కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ వాలంటీర్ వ్యవస్థ ఉండాలన్నా, మేమంతా ప్రభుత్వ పదవుల్లో ఉండాలన్నా వైసిపి అభ్యర్థులు కచ్చితంగా విజయం సాధించాలని అన్నారు. గతంలో వాలంటీర్ వ్యవస్థపై అనేక ఆరోపణ చేసిన టిడిపి నాయకులు ప్రస్తుతం వాలంటీర్ వ్యవస్థత కొనసాగిస్తామని మాయమాటలు చెబుతోందని, వాటిని విశ్వసించొద్దని సూచించారు. మాజీ ఎమ్మెల్యేలు నరేష్ కుమార్ అగర్వాల్, పిరియా సాయిరాజ్ మాట్లాడుతూ అందరం కష్టపడి ఎంపీ అభ్యర్థి తిలక్, ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించుకోవాలని సూచించారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకుడు పొన్నాడ రవికుమార్, కడియాల ప్రకాష్, నర్తు నరేంద్ర, పూడి లక్ష్మణరావు, రజనీకుమార్ దొలై, పాండవ చంద్రశేఖర్, దేవరాజు సాహు, ఎన్.బాబూరావు, యలమంచి నీలయ్య, పులకల శ్రీరాములు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : రానున్న ఎన్నికల్లో వైసిపి ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ గెలుపునకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ కోరారు. స్థానిక ఫంక్షన్ హాల్‌లో మండలం మున్సిపాలిటీ పరిధిలోని ఇటీవల రాజీనామా చేసిన వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నరేష్ కుమార్ అగర్వాల్, చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ భారతి దివ్య, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, మండల అధ్యక్షులు రాజశేఖరరెడ్డి, చిట్టిబాబు, పురుషోత్తంరెడ్డి, సాలీనా ఢిల్లీ పాల్గొన్నారు.

శిరీషకు ఒక్క అవకాశం ఇవ్వండి

ప్రజాశక్తి- పలాస

పలాస ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి గౌతు శిరీషకు ఒక్క అవకాశం ఇవ్వాలని టిడిపి నాయకులు వజ్జ గంగా భవాని, దానేటి పద్మజీ కోరారు. స్థానిక శివాజీ నగర్, సాయిబుల కాలనీ, సూదికొండ ప్రాంతాల్లో ఆదివారం ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గౌతు శిరీషను గెలిపిస్తే పలాస నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తారన్నారు. గత పాలకులు పలాస మున్సిపాలిటీని అభివృద్ధి చేయలేదని, కనీసం మున్సిపాలిటీలో తాగునీరు సరఫరా చేసే పరిస్థితి లేదని అన్నారు. ప్రజలు ఆలోచించి ఎమ్మెల్యేగా గౌతు శిరీష, ఎంపీ రామ్మోహన్ నాయుడును సైకిల్ గుర్తుపై ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సంతోష్ పండా, బడ్డ నాగరాజు, జోగ మల్లి, సప్ప నవీన్, పాలవలస వైకుంఠరావు, జోగారావు, కూర్మారావు, చిరంజీవి, యవ్వరి మోహనరావు, శశిరేఖ, జి.బేబీ, స్రవంతి, జీవరత్నం పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న గంగాభవాని, పద్మజీ

కండువా వేస్తున్న వెంకన్న చౌదరి

టిడిపితోనే అభివృద్ధి సాధ్యం

పలాస : మందస మండలం జిల్లుండకు చెందిన వైసిపి కార్యకర్తలు పలాస నూతన టిడిపి కార్యాలయంలో ఆదివారం వైసిపిని వీడి టిడిపిలో చేరారు. పార్టీలో చేరిన వారికి నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి పార్టీ కండువా కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో నర్తు హరి, నెయ్యల రామారావు, కె.సుమన్. రాజేష్, కృష్ణ, సోమేష్ ఉన్నారు. హేమసుందర్, బాలకృష్ణ, లక్ష్మినారాయణ, పురుషోత్తం పాల్గొన్నారు.

రాముబెడ్డి...

నౌపడ : సంతబొమ్మాళి మండలం నౌపడకు చెందిన సీనియర్ జర్నలిస్టు కోటరాము రెడ్డి టిడిపిలోకి చేరనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24న టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సమక్షంలో టిడిపిలో చేరుతున్నట్లు చెప్పారు. ఆయన పాతికేళ్ల పాటు పలు పత్రికలు, ఛానళ్లలో పనిచేశారు.

తాగునీటి బావి శుభ్రం

నందిగాం : మండలంలోని పెద్దతామరపల్లిలో ఉన్న బేతాలు స్వామి బావిని ఉప సర్పంచ్ టి.రామారావు ఆధ్వర్యాన యువకులు ఆదివారం శుభ్రం చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని నీటి ఎద్దడి నివారణకు నూతిలో పేరుకుపోయిన మట్టిని తొలగించి శుభ్రపరిచారు. దీంతో యథావిధిగా నీరు చేరడంతో గ్రామస్తులకు మళ్లీ ఉపయోగ పడినట్లు అయిందని గ్రామస్తులు తెలిపారు.

బావిని శుభ్రం చేస్తున్న యువకులు

వైద్య శిబిరానికి స్పందన

మందులను పంపిణీ చేస్తున్న గోవిందరాజు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

బోయిన గోవిందరాజులు హాస్పిటల్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం ఉచిత మోగా వైద్య శిబిరం నిర్వహించారు. రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్యులు ఐదు వందల మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అంతకుముందు పారిశ్రామికవేత్త, టిడిపి నాయకులు బోయిన గోవిందరాజులు నూతగా ఏర్పాటు చేసిన జెమ్స్ మల్టీస్పెషాలిటీ క్లినిక్ ఆస్పత్రిని ప్రారంభించారు. ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ శిబిరంలో జెమ్స్ వైద్యులు బిపి, సుగర్, ఇసిజి, నేత్ర వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారని అన్నారు. జెమ్స్ మల్టీస్పెషాలిటీ క్లినిక్ ఆస్పత్రిలో రోజూ అన్ని రకాల వ్యాధులకు సంబంధించిన వైద్యులు అందుబాటులో ఉంటారని, ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెమ్స్ ఆస్పత్రి ఏరియా మేనేజర్ బి.చిన్నారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కలాం ఫౌండేషన్ ఉదారత

ప్రజాశక్తి- కవిటి

డాక్టర్ అబ్దుల్ కలాం ఫౌండేషన్ మరోసారి తన ఉదారత చాటుకుంది. మండలంలోని నెలవంకకు చెందిన వ్యక్తికి ఆర్థికసాయం అందించి అండగా నిలబడింది. నెలవంకకు చెందిన దుంప లచ్చయ్యకు వ్యాధి సంక్రమించడంతో వైద్యులు కాలు తొలగించారు. దీంతో రెక్కాడితే గానీ డొక్కాడని ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. సంస్థ సభ్యుల ద్వారా విషయం తెలుసుకున్న కలాం ఫౌండేషన్ సభ్యులు ఆదివారం నెలవంక చేరుకుని లచ్చయ్యను పరామర్శించారు. అండగా ఉంటామని హామీ ఇచ్చి రూ.11 వేలు ఆర్థిక సాయం అందించారు.

ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

నేడు పరమేశ్వరరావు నామినేషన్

టెక్కలి : ఇండియా ఫోరం ఎంపీ అభ్యర్థిగా డిసిసి అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు సోమవారం తన నామినేషన్ మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టరేట్‌లో వేయన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. తన నామినేషన్ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, మద్దతుదారులు పాల్గొని విజయవంతం చేయాలని పరమేశ్వరరావు కోరారు.

నేడు అప్పలరాజు నామినేషన్

ప్రజాశక్తి- పలాస

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సీదిరి అప్పలరాజు సోమవారం స్థానిక ఎన్నికల అధికారి వద్ద తన నామినేషన్ పత్రాలను దాఖలు చేయనున్నారు. నామినేషన్ కార్యక్రమం అట్టహాసంగా జరిపేందుకు మంత్రి కేడర్ అంతా ఇప్పటికే సిద్ధం చేశారు. నియోజకవర్గ నలుమూలల నుంచి 20 నుంచి 30 వేల మంది కార్యకర్తలను పలాసకు తీసుకువచ్చి ర్యాలీగా బయలు దేరి కాశీబుగ్గ మూడు రోడ్డు కూలి నుంచి ర్యాలీ నిర్వహించనున్నారు. అనతరం తహశీల్దార్ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో వైసిపి నాయకులతో, కార్యకర్తలతో సందడి చేసుకుంటూ ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారు.

నేడు అచ్చెన్నాయుడు నామినేషన్

టెక్కలి: టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం తన నామినేషన్ వేయనున్నారు. టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మధ్యాహ్నం నామినేషన్ దాఖలు చేసే సందర్భంగా టెక్కలిలో భారీ ర్యాలీ నిర్వహించునున్నారు. ఉదయం 7 గంటలకు ఏడున్నరకు కోటబొమ్మాళి మండలం కొత్తపేటలోని కొత్తమ్మతల్లి ఆలయాన్ని దర్శించనున్నారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా వచ్చి అంబేద్కర్ కూడలి వద్ద సమావేశం నిర్వహించనున్నారు. టెక్కలి నియోజకవర్గం నలుమూలల నుంచి 50 వేల మంది వరకు హాజరుకావాలని అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. దీంతో జనసమీకరణకు కార్యకర్తలు సన్నద్ధమవుతున్నారు.

25న విజయ నామినేషన్

కవిటి: ఈనెల 25న వైసిపి అభ్యర్థిగా పిరియా విజయ నామినేషన్ వేయనున్నట్లు మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ తెలిపారు. కవిటిలో ఆదివారం మాట్లాడుతూ ఈ రోజు మధ్యాహ్నం రెండు గంటలకు మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కొజ్జిరి కూడలి వద్దకు చేరుకోవాలని సూచించారు. అక్కడ నుంచి ర్యాలీగా బయలుదేరి ఇచ్ఛాపురం చేరుకుని నామినేషన్ దాఖలు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలను భాగస్వామ్యులను చేసి కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన పిచ్చి మొక్కలు

రోడ్డును కప్పేస్తున్న పిచ్చిమొక్కలు

మెళియాపుట్టి: మండలంలోని సుర్జిని బిటి రోడ్డు రూపు కోల్పోతుంది. ఈ రహదారిలో రోడ్డుకు ఇరువైపులా ఉండే పిచ్చి మొక్కలు రోడ్డుకు పేరుకుపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. విశాలంగా ఉన్న రహదారి పిచ్చి మొక్కలు కారణంగా రూపు కోల్పోతుంది. అలాగే బిటి రోడ్డు అంతా గోతులమయం కావడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. పిచ్చి మొక్కలకు ఆవాసంగా రోడ్డును కప్పేస్తున్నాయి. దీనితో వాహనదారులు వెళ్లే సమయంలో కాలిబాటన ప్రయాణించేవారు తప్పించుకోలేని పరిస్థితి ఏర్పడింది. రహదారికి ఇరువైపులా జంగిల్ పనులు చేపడితే ఈ సమస్య ఉండదని, ఆర్అండ్‌బి అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే బిటి రోడ్డు గోతులను పూడ్చాలని కోరుతున్నారు.

జ్ఞాపికను స్వీకరిస్తున్న ఆకాష్

అరసవల్లిని సందర్శించిన ఆకాష్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వర్ధమాన సినీ హీరో, ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ తనయుడు పూరి ఆకాష్ ఆదివారం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించారు. స్వామివారి సేవల్లో పాల్గొన్న ఆయనకు స్వామివారి శేష వస్త్రాలు కప్పి పాలక మండలి సభ్యులు మండవిల్లి రవి జ్ఞాపికను అందజేశారు. ఆయనతో పాటు ఆలయ ఇఒ చంద్రశేఖర్, సీనియర్ సహాయకులు కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

సెలవుల్లో సరదాగా...

ప్రజాశక్తి- టెక్కలి

రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వేసవి సెలవుల్లో ప్రభుత్వ విద్యాశాఖ వినూత్నమైన కార్యక్రమం చేపట్టింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. సెలవుల్లో సరదాగా 24 అనే కార్యక్రమం పేరుతో వీటిని అమలుజేయనుంది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను విద్యాశాఖ జారీ చేస్తూ... పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు దిశానిర్దేశం చేసింది. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వేసవి క్యాంపులు నిర్వహించనున్నారు. ఇందుకు గాను వ్యాయామ ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. పుస్తకాలను చదివించాలనే ఉద్దేశం, ఆసక్తి పెంచడం, వంటి వాటి కోసం కథల పుస్తకాలు చదవడం, ఉయ్‌లవ్‌రీడింగ్ పేరుతో పోటీలు నిర్వహించడం వంటి వాటిని నిర్వహించాలి. విద్యార్థులకు సెలవుల్లో సరదాగా కాసేపు కార్యక్రమం పేరుతో నిర్వహించే కార్యక్రమంలో భాగంగా వారిలో ఉండే అంతర్గత నైపుణ్యాలను వెలికితీయడం, క్రీడలు, వృత్తి నైపుణ్యం, సృజనాత్మకత కళలపై దృష్టి పెట్టడం, వంటి వాటిని వెలికితీయాలి. అనంతరం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలను విద్యాశాఖ విడుదల చేసింది.

ఘనంగా సూర్యనారాయణ స్వామి వార్షిక కళ్యాణం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి వార్షిక కళ్యాణ మహోత్సవం ఆదివారం కన్నుల పండువుగా సాగింది. ఆలయ సాంప్రదాయ ప్రకారం ఏటా చైత్రశుద్ధ త్రయోదశి రోజు ఈ కళ్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలోని అనివెట్టి మండపంలో స్వామి వారి కళ్యాణమూర్తులకు సదస్యం, మహదాశీర్వచనములు, వేదసదస్సు నిర్వహించారు. అనంతరం పండిత సత్కారం జరిగింది. ఉషా, ఛాయ, పద్మిని సమేతుడైన స్వామివారి కళ్యాణ వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో పండితులు సుసారపు చంద్రశేఖర్ శర్మ, బంకుపల్లి రమేష్ శర్మ, సాయి కుమార్ శర్మ, రంప ఆదిత్య శర్మ, వనమలి వెంకటరమణ వరులు, పద్మనాభాచార్యులు, పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, కోటేశ్వరరావు, లుకలాపు గోవిందరావు, ఆలయ ఇఒ ఎస్.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తీర ప్రాంతంలో దాహం కేకలు

వారం రోజులుగా నిలిచిన నీటి సరఫరా

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం భావనపాడులో దాహం కేకలు వినిపిస్తున్నాయి. గ్రామంలో తాగునీటి పథకం ద్వారా అందిస్తున్న తాగునీరు పూర్తిస్థాయిలో అందక పోవడంతో సముద్ర తీరంలోని చెలమల వద్ద మహిళలు బారులు తీరుతున్నారు. ఇసుక దిబ్బలపై చెలమలు, బావులు వద్ద నుంచి సుమారు కిలోమీటర్ మేర నడిచి వెళ్లి బిందెలతో ఇంటికి నీరు తెచ్చుకునే పరిస్థితి కనిపిస్తుంది. గ్రామంలో ఉప్పునీరు అధికంగా రావడంతో పక్క గ్రామల నుంచి పైపులైన్ ద్వారా నీటిని తెచ్చి ట్యాంకును నింపి గ్రామంలో సరఫరా చేస్తుంటారు. మండలంలోని

తమవంతు నీటి కోసం వేచి ఉన్న మహిళలు

భావనపాడే కాదు తీర ప్రాంతంలో పలు గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి. నాయకులు ప్రతి ఎన్నికలకూ తాగునీటి సరఫరాపై వాగ్దానాలు ఇవ్వడం తర్వాత పట్టించుకోక పోవడంతో తీర ప్రాంతంలో తాగునీటి ఎద్దడి తప్పడం లేదు. ఒక బిందె నీటి కోసం కిలో మీటర్ దూరం వెళ్లాల్సి రావడంతో గంటల తరబడి సమయం పడుతుంది. దీంతో పలువురు ఉపాధి హామీ పనులకు వెళ్లలేక నీటి కోసం కాపు కాయాల్సిన పరిస్థితి వస్తుంది. చెలమల్లో నీరు ఉన్నంతవరకే నీటిని తోడి తర్వాత నీరు ఊరినంతవరకు వేచి ఉండాల్సిన పరిస్థితి భావనపాడులో ప్రస్తుతం ఉంది. ప్రస్తుతం భావనపాడుకు వస్తున్న నీటిని దారి మధ్యలో ఉన్న సూర్యమణిపురం గ్రామస్తులు అడ్డుకోవడంతో తమ గ్రామానికి పూర్తి స్థాయిలో నీరు అందడం లేదని గ్రామ స్థుడు బి.ఫకీరు చెప్తున్నారు. ఇది వరకే అధికా రులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని వాపోతున్నారు. గ్రామస్తులకు పూర్తిస్థాయిలో నీటి సరఫరా చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని మహిళలు కోరుతున్నారు.

ఆన్‌లైన్‌లో కృష్ణదాస్ నామినేషన్

ప్రజాశక్తి- పోలాకి

నరసన్నపేట నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్ ఆదివారం ఆన్‌లైన్‌లో నామినేషన్ దాఖలు చేశారు. సాంప్రదాయబద్ధంగా పోలాకి మండలం రాళ్లపాడు అభయాం జనేయ స్వామి వారి ఆలయాన్ని సందర్శించారు. ఈ మేరకు ఆన్‌లైన్ నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. అనంతరం ఆన్‌లైన్‌లో నామినేషన్ అప్‌లోడ్ చేసి ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో తన నామినేషన్‌ను సమర్పించారు. అలాగే ఈ నెల 25న అధికార పూర్వకంగా సెట్-2 నామినేషన్ వేయనున్నారు. ఈ సందర్భంగా ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నారు.

నామినేషన్ పత్రంపై సంతకం చేస్తున్న కృష్ణదాస్

ప్రచారం చేస్తున్న విజయ

విజయ ఎన్నికల ప్రచారం

సోంపేట : మండలంలోని పలాసపురం పంచాయతీ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిని పిరియా విజయ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సిఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి తడక యశోద, సర్పంచ్ తడక జోగారావు, ఎంపిపి నిమ్మన దాసు, మద్దు రాజారావు, బత్తకల మోహనరావు, శిలగాన భాస్కరరావు, బుద్దాన శ్రీకృష్ణ, రమణమూర్తి పాల్గొన్నారు.

32 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని ప్రతాప్ విశ్వనాథపురంలో పది రోజులుగా పలువురు జ్వరాలబడిన పడి అనారోగ్యం పాలవుతున్నారు. దీంతో సిపిఎం నాయకులు పి.సాంబమూర్తి చొరవ తీసుకొని నందిగాం వైద్యాధికారిని సంప్రదించారు. వైద్యాధికారి ఆర్.సుకన్య స్పందించి తన సిబ్బందితో పి.వి.పురంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు 32 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి సుకన్య

ఫౌంటెయిన్ కాదు... ఉద్దానం నీటి పైపు

ఎగసిపడుతున్న తాగునీరు

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని సహలాలపుట్టుగ పంచాయతీలో ఇటీవల వేసిన ఉద్దానం పైపులైను నుంచి తాగునీరు ఎగసిపడుతోంది. గత 20 రోజులుగా ఫౌంటెన్ మాదిరిగా నీరు ఎగసిపడుతున్నా సంబంధిత సిబ్బంది పట్టించుకోకపోవడంతో నీరు వృథాగాపోతోంది. దీనిపై స్థానిక సర్పంచ్ ప్రతినిధి రవిప్రధాన్ సంబంధిత సిబ్బందికి ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకూ కనీసం వచ్చి చూసిన పరిస్థితి లేదని వాపోయారు. దీంతో స్థానికంగా ఉంటున్న రైతులు వాటికి గుడ్డలు కట్టి తమ పశువుల అవసరాల కోసం వాడుకుంటున్నారు. కేవలం అక్కడే కాకుండా మండలంలో చాలా ప్రదేశాల్లో కొత్తగా వేసిన ఉద్దానం తాగునీటి పథకం పైపులైను లీకై నీరు వృథామవుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు. ఇటీవల డి.జి.పుట్టుగలో పైపులైను మరమ్మతులకు గురై నెల రోజుల పాటు నీరు వృథాగాపోయింది. గ్రామస్తుల ఫిర్యాదుతో తరువాత దానికి మరమ్మతులు చేశారు. ఇప్పటికైనా మండల వ్యాప్తంగా కొత్తగా వేసిన తాగునీటి పైపులైను పరిశీలించి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కానరాని అగ్నిమాపక వారోత్సవాలు

ప్రజాశక్తి- పొందూరు

వేసవిలో అగ్ని ప్రమాదాలకు ఎక్కువ ఆస్కారం ఉండే కాలం. ఈ కాలంలో భానుడు భగభగా మండడంతో ఎండలు తీవ్రత కారణంగా ప్రతిరోజు ఎక్కడో ఒక దగ్గర అగ్ని ప్రమా దాలు జరిగి నట్లుగా వింటూ ఉంటాం. ఇలాంటి సమయంలో అగ్నిప్రమాదాలు ఏ విధంగా సంభవిస్తాయి, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఎటువంటి జాగ్రత్తలు తీసుకుని వాటిని నివారించాలనేది ప్రజల్లో అవగాహన కలిగించాలి.

పొందూరు అగ్నిమాపక కేంద్రం

తద్వారా ధన, ప్రాణ నష్టాన్ని నివారించవచ్చు. అందుకుగాను ప్రతిఏటా ఏప్రిల్ 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలను ప్రభుత్వం చేపట్టి సదస్సులు, డెమోలు, ప్రదర్శనలు ద్వారా ప్రజల్లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తుంది. జిల్లాలో అన్ని అగ్నిమాపక కేంద్రాల్లో వారోత్సవాలను నిర్వహించినప్పటికీ పొందూరు అగ్నిమాపక కేంద్రంలో మాత్రం ఈ వారోత్సవాల నిర్వాహణ మాత్రం కాన రాలేదంటూ పలువురు పేర్కొంటున్నారు.అవుట్‌పోస్టు అగ్నిమాపక కేంద్రం కావడంతో వీటి నిర్వాహణ బాధ్యతలను కాంట్రాక్టు ప్రాతిపదికన చేపడతారు. ఇందులో సిబ్బంది జీతభత్యాలు, అగ్నిమాపక వాహనం నిర్వాహణను అంతా ఆ కాంట్రాక్టర్ చూసుకోవాల్సి ఉంటుంది. కాని మార్చి 2024తో ఈ కాంట్రాక్ట్ కాలం ముగియడంతో అధికారులు అగ్నిమాపక వారోత్సవాలను చేపట్టలేదు. దీనిపై ఇన్‌ఛార్జి ఎస్ఎఫ్ఒ పి.అశోక్ మాట్లాడుతూ పొందూరు అవుట్‌పోస్టు అగ్నిమాపక కేంద్రం కాంట్రాక్ట్ గడువు గత నెలతో ముగిసిందని, ప్రస్తుతం ఎన్నికలు ముగిసిన తరువాత కొత్త కాంట్రాక్టులను నియామకం చేపట్టడం జరుగు తుందని, అంతవరకూ కేంద్రం నిర్వాహణను చూడాలని డిఎఫ్ఒ ఇప్పుడున్న కాంట్రాక్టర్‌కు తెలిపారన్నారు. ఆ కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడం వలన అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహించలేదని పేర్కొన్నారు.